



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 76 | బుధవారం 13 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## ఓట్ల చోరీపై ఇండియా పోరం వినూత్న నిరసన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 12

'ఓట్ల చోరీ'పై పార్లమెంట్‌లో ఇండియా ఫోరం మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపింది. మహిళా ఓటరు మింతా దేవి ముఖం ముద్రించి ఉన్న టీషర్ట్స్ ధరించి నిరసనలో పాల్గొన్నారు. టీషర్ట్ వెనుక భాగంలో 124 నాటౌట్ అని రాసి ఉంది. ప్రియాంకగాంధీ, గౌరవ్ గొగోయ్, వామపక్షాలు సహా డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన ఉద్ధవ్ వర్గానికి

- మిగతా 2లో..

## ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రంలో
# తీవ్ర ఉద్రిక్తత

- తీవ్ర ఉద్రిక్తతల నడుమ... ముగిసిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ పోలింగ్
- జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి సహా నేతలు కేంద్రంలోకి చొరబాటు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు, ఆందోళనకారుల చెదరగొట్టారు
- రెండు నియోజకవర్గాల్లోనూ టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు



కడప - సూర్య వాస్తవం, ఆగస్టు 12

వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు మంగళవారం జరిగిన ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

- మిగతా 2లో..



## జర్మన్ పెట్టుబడిదారుల్లో సన్నగిల్లిన ధైర్యం, విశ్వాసం

- అమెరికాతో కొత్త వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ఆందోళన

బెర్లిన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 12

జర్మనీ పెట్టుబడిదారుల్లో ధైర్యం, విశ్వాసం ఆగస్టు మాసంలో అనుకున్నదాని కన్నా గణనీయంగా క్షీణించిందని ఒక సర్వేలో వెల్లడైంది. యురోపియన్ యూనియన్-అమెరికా మధ్య

- మిగతా 2లో..

## ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి
# పని చేసేలా చూడాలి

- భారీ వర్షాలపై రేవంత్ రెడ్డి సమీక్ష
- మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని ఆదేశం
- ఆకస్మిక వరదలు వస్తే ఎయిర్ లిఫ్టింగ్‌కు హెలికాప్టర్లు సిద్ధంగా ఉండాలని సూచన
- రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలన్న సీఎం



హైదరాబాద్- సూర్య వాస్తవం, ఆగస్టు 12

తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేసేలా చూడాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

- మిగతా 2లో..

# 'స్త్రీ శక్తి'కి సర్వం సిద్ధం

- ఆగస్ట్ 15 నుంచి ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- 'స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష
- ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 12

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 15 నుంచి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం 'స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో

- మిగతా 2లో..

## ఉప ఎన్నికలను రద్దు చేసి మళ్లీ జరపాలి

- పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తీవ్ర అక్రమాలు జరిగాయన్న జగన్
-అధికారాన్ని దుర్వినియోగం చేసి చంద్రబాబు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణ
- పోలీసులే దగ్గరుండి టీడీపీ దౌర్జన్యాలకు కాపలా కాశారని విమర్శ - ఈ ఎన్నికలను రద్దు చేసి, కేంద్ర బలగాల పర్యవేక్షణలో తిరిగి నిర్వహించాలని డిమాండ్ - అక్రమాలపై ఆధారాలతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వెల్లడి - ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన రోజు ఒక బ్లాక్ డే అని వ్యాఖ్య




- మిగతా 2లో..

## 30 ఏళ్ల తర్వాత
# ప్రజాస్వామ్యం గెలిచింది

- పులివెందులలో 30 ఏళ్లలో తొలిసారి ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేశారన్న లోకేశ్
- భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకోవడం ప్రజాస్వామ్యం కాదని హితవు
- ఓటు హక్కు వినియోగించుకున్న పులివెందుల ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన లోకేశ్






## ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి

- అమరావతి నిర్మాణంపై చంద్రబాబు సమీక్ష
- గత ప్రభుత్వంలో ఇసుకనూ ఎత్తుకెళ్లారని సీఎంకు కాంట్రాక్టర్ల ఫిర్యాదు
- రైతుల ప్లాట్ల బదిలీ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామన్న మంత్రి నారాయణ

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

- నామినేటెడ్ పదవులను భర్తీ చేసిన ఎన్డీయే ప్రభుత్వం
- మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు కీలక బాధ్యతలు
- వివిధ సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ నియామకాలు
- ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ.. పూర్తి జాబితా విడుదల

## ఏపీలో 31 కార్పొరేషన్లకు
# ఛైర్మన్ల నియామకం..



అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 12

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన నేతలకు తగిన గుర్తింపునిస్తూ, వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. ఈ మేరకు 31 మందితో కూడిన జాబితాను ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ ఈ నియామకాలు చేపట్టడం గమనార్హం. ఈ పదవుల కేటాయింపులో ప్రభుత్వం బీసీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించింది. మొత్తం 31 పోస్టులలో 17 పదవులను బీసీలకే కేటాయించి సామాజిక న్యాయం పట్ల తమ నిబద్ధతను చాటుకుంది. వీరితో పాటు ఓసీ వర్గానికి 6, ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, మైనార్టీలకు 2 చొప్పున పదవులను కేటాయించారు. ఈ నియామకాల ద్వారా అన్ని వర్గాలకు సమ ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం చేసినట్లు స్పష్టమవుతోంది. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు కూడా ఈ జాబితాలో సముచిత స్థానం కల్పించారు.

- మిగతా 2లో..

## ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రంలో

# తీవ్ర ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. నిర్ణీత సమయానికి క్యూలైన్లలో నిలబడి ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాలు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే పులివెందులలో 71.36 శాతం, ఒంటిమిట్టలో 66.39 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఉప ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య గట్టి పోటీ కనిపించింది. పులివెందులలో టీడీపీ తరఫున బీటెక్ రవి అర్ధాంగి మారెడ్డి లతారెడ్డి, వైసీపీ తరఫున హేమంత్‌రెడ్డి ప్రధాన అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఒంటిమిట్టలో టీడీపీ నుంచి ముద్దు కృష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగం రెడ్డి పోటీ పడ్డారు. రెండు చోట్లా మొత్తం 11 మంది చొప్పున అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కాగా, ఒంటిమిట్టలో పోలింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేనమామ కె. రవీంద్రనాథ్ రెడ్డి తన అనుచరులతో కలిసి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న బారికేడ్లు, కుర్చీలను తోసివేయడంతో అక్కడ గందరగోళం చెలరేగింది. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వైసీపీ నేతలను చెదరగొట్టి, పోలింగ్ ప్రశాంతంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

## ఓట్ల చోరీపై ఇండియా ఫోరం వినూత్న నిరసన

(మొదటిపేజీ తరువాయి)

చెందిన పలువురు ఎంపిలు ఈ టీషర్ట్స్ ధరించి నిరసన తెలిపారు. బీహార్‌లో దారుంధ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మింతా దేవి వయస్సు ఓట్ల జాబితాలో 124 సంవత్సరాలుగా పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆగస్ట్ 7న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో ఆమె పేరు సహా ఓటర్ల జాబితా ప్రకారం 100 సంవత్సరాల కన్నా ఎక్కువ వయస్సు ఉన్న ఇద్దరు మహిళల పేర్లను వెల్లడించారు. అయితే గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం జీవించి ఉన్న అతి పెద్ద వయస్కురాలు యుకెకి చెందిన ఎథెల్ కాటర్‌హామ్ (115) అని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మింతా దేవి మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకున్నారని కాంగ్రెస్ సభ్యులు మాణికం ఠాగూర్ తెలిపారు. ఆమె వయస్సు 124 సంవత్సరాలుగా పేర్కొన్నారని, ఇటువంటి మోసాలపై చర్చ జరపాలని కోరుకుంటున్నామని అన్నారు. ఎన్నికల సంఘం (ఇసి) బిజెపికి అనుకూలంగా మారడంతో ఓటర్ల జాబితా పూర్తిగా ఇటువంటి మోసాలతో నిండి ఉందని మండిపడ్డారు. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కి వ్యతిరేకంగా గత 15రోజులుగా ఇండియా ఫోరం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపడుతోంది.

## జర్మన్ పెట్టుబడిదారుల్లో సన్నగిల్లిన ధైర్యం, విశ్వాసం

(మొదటిపేజీ తరువాయి)

కుదిరిన కొత్త వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న తీవ్రమైన అసంతృప్తే దీనికి కారణంగా భావిస్తున్నారు. దీనికి తోడు బలహీనంగా వున్న ఆర్థిక గణాంకాలు కూడా మరికొంత భయాన్ని జోడించాయి. జులై మాసంలో 52.7గా వున్న జ్యూ ఎకనామిక్ సెంటిమెంట్ ఇండెక్స్ ఆగస్టులో 34.7కి పడిపోయింది. జర్మనీలోని ప్రధాన ఆర్థిక పరిశోధనా సంస్థల్లో ఒకటైన 'జ్యూ' ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వే నివేదిక విడుదల సందర్భంగా జ్యూ అధ్యక్షులు అచిమ్ వాంబక్ మాట్లాడుతూ ఇయు-యుఎస్ వాణిజ్య ఒప్పందం ప్రకటించగానే ఆర్థిక మార్కెట్ నిపుణులు చాలా నిరాశ చెందారని తెలిపారు. ఈ కొత్త వాణిజ్య ఒప్పందం పెట్టుబడిదారుల అంచనాలను, ఆశలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. ముఖ్యంగా రసాయనాలు, ఫార్మాస్యూటికల్ రంగాల్లో పరిస్థితి దారుణంగా వుందన్నారు. దీంతో పాటు మెకానికల్ ఇంజనీరింగ్, లోహాలు, ఆటోమోటివ్ పరిశ్రమల్లో కూడా పరిస్థితులు అలానే వున్నాయి. టారిఫ్‌లు తప్పించుకునేందుకు ముందుగానే కొనుగోలు చేయడంతో అమెరికా డిమాండ్ సన్నగిల్లినట్లు సర్వేలో తేలిందన్నారు. ఆ కారణంగా రెండో త్రైమాసికంలో జర్మనీ ఆర్థిక వ్యవస్థ కూడా 0.1 శాతం సంకోచించినట్లు పేర్కొన్నారు.

1. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ: ఆకేపోగు ప్రభాకర్ (కొడుమూరు, టీడీపీ)
2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు: బాలకోటయ్య (నందిగామ, బహుజన జేఏసీ)
3. ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్: బ్రహ్మం చౌదరి (గురజాల, టీడీపీ) 4. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్: బుచ్చి రామ్ ప్రసాద్ (గుంటూరు వెస్ట్, టీడీపీ) 5. ఆంధ్రప్రదేశ్ ముదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: సీఎస్ త్యాగరాజన్ (చిత్తూరు, టీడీపీ) 6. ఆంధ్రప్రదేశ్ బొందిలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: డి. విక్రమ్ సింగ్ (కర్నూలు, టీడీపీ) 7. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్ డీపీటీ): దాసరి శ్రీనివాసులు (తిరుపతి, బీజేపీ) 8. ఆంధ్రప్రదేశ్ వడ్డీ అభివృద్ధి కార్పొరేషన్: గుంటసల వెంకటలక్ష్మి (దెందులూరు, జనసేన) 9. ఆంధ్రప్రదేశ్ ఆరెకటిక/కటిక/ఆరే-సూర్యవంశీ సంక్షేమ, అభివృద్ధి సంఘం: హరికృష్ణరావు హనుమంతకరి (తాడిపత్రి, టీడీపీ)
10. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: కమ్మరి పార్వతి (పాణ్యం, టీడీపీ) 11. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కుంచిటి వక్కలిగ, వక్కలిగర, కుంచిటిగ సంక్షేమ, అభివృద్ధి సంఘం: లక్ష్మీనారాయణ (మడకశిర, టీడీపీ) 12. ఆంధ్రప్రదేశ్ నగరాలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: మరుపిల్ల తిరుమలేశ్వరరావు (విజయవాడ వెస్ట్, టీడీపీ) 13. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాల-ఏకరి, వ్యాకుల, నాయనివారు, పాలెగారు, తోలగారి, కవలి సంక్షేమ, అభివృద్ధి సంఘం: నాగేశ్వర నాయుడు కందూరి (రాయచోటి, టీడీపీ) 14. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్బాష/దుదేకుల కార్పొరేషన్: నాగుల్ మీరా కాసునూరి (విజయవాడ వెస్ట్, టీడీపీ) 15. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురకుల, పొందర సంక్షేమ, అభివృద్ధి సంఘం: నరసింహులు దామోదర (నరసన్నపేట, టీడీపీ) 16. ఆంధ్రప్రదేశ్ వికలాంగులు, వృద్ధ పౌరుల సహాయ కార్పొరేషన్: నారాయణ స్వామి (రాప్తాడు, టీడీపీ) 17. ఆంధ్రప్రదేశ్ కనీస వేతన సలహా బోర్డు: పెళ్ళకూరు శ్రీనివాసులు రెడ్డి (కోవూరు, టీడీపీ) 18. మాంసం అభివృద్ధి కార్పొరేషన్: ప్రకాశ్ నాయుడు (సింగనమల, టీడీపీ) 19. తెలుగు మరియు సంస్కృత అకాడమీ: ఆర్. డి. విల్సన్ (నెల్లూరు సిటీ, బీజేపీ) 20. ఆంధ్రప్రదేశ్ సగర/ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: ఆర్. వెంకటరమణప్ప (పెనుకొండ, టీడీపీ) 21. ఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: రామనారాయణ రావు ఎరుబోతు (విజయవాడ సెంట్రల్, టీడీపీ) 22. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాళింగ కోమటి/కాళింగ వైశ్య సంక్షేమ, అభివృద్ధి సంఘం: రమేష్ మొదలవలస (ఆమదాలవలస, టీడీపీ)
23. సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ: రవి మందలపు (రాజమండ్రి సిటీ, టీడీపీ) 24. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్: రెడ్డి అనంత కుమారి (కొత్తపేట, టీడీపీ)
25. ఆంధ్రప్రదేశ్ బెస్తా సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్: శ్రీధర్ బొమ్మన (సూళ్లూరుపేట, టీడీపీ)
26. ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ (ఓయూడీఏ): షేక్ రియాజ్ (ఒంగోలు, జనసేన)
27. జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ: శ్రీ వంపూరు గంగులయ్య (పాడేరు, జనసేన)
28. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ లింగాయత, లింగబలిజ సంక్షేమ, అభివృద్ధి సంఘం: స్వప్న (అనంతపురం అర్బన్, టీడీపీ) 29. ఆంధ్రప్రదేశ్ కృష్ణ బలిజ/పూసల సహకార ఆర్థిక కార్పొరేషన్: త్రిమూర్తులు గంట (భీమవరం, టీడీపీ) 30. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంగం సంక్షేమ, అభివృద్ధి సంఘం: వి. చంద్రశేఖర్ (పీలేరు, టీడీపీ) 31. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దాసరి సంక్షేమ, అభివృద్ధి సంఘం: వెంకట రత్నాజీ పొత్తూర్రు (శృంగవరపుకోట, టీడీపీ)

# 'స్త్రీ శక్తి'కి సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో సీఎం అధికారులను ఆదేశించారు. అధిక రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలని, అందుకు తగ్గట్టు సామర్థ్యం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని... ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించి ప్రయాణికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి అనుగుణంగా పథకాన్ని మరింత మెరుగ్గా అమలు పరచాలని సీఎం నిర్దేశించారు. సర్వీస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించేలా చూడాలన్నారు.

**సమస్యలు వెంటనే పరిష్కరించేలా...**

"ఈపోస్ మిషన్లకు జీపీఎస్ తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానమై పనిచేయాలి. సమస్యలు ఎక్కడైనా ఉత్పన్నమైతే వాటిని వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్ధంగా ఉండాలి. బస్ స్టేషన్లు అత్యంత పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలిగించాలి. టాయిలెట్లను ప్రతి 2 గంటలకు ఒకసారి శుభ్రపరచాలి. దీనిపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలి.

ప్రయాణికులు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదు. అన్ని బస్ స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. రూ.30 కోట్లతో చేపట్టిన బస్ స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాలి. అవసరమైన చోట్ల కొత్తగా ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు చేయాలి. ప్యాసింజర్లకు సహకరించేలా 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది బస్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలి" అని చంద్రబాబు వివరించారు.

**బ్రేక్ డౌన్‌లు తలెత్తకుండా...!**

రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు అదనంగా నడపాల్సి వస్తుండటంతో బస్సులు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని వివరించారు. వీరికి జీరో ఫేర్ టిక్కెట్ కోసం ఈపోస్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ ఆగస్ట్ 14కల్లా అప్డేట్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యిందని వెల్లడించారు. స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ఈనెల 15న మధ్యాహ్నం విజయవాడలోని పండింట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రారంభిస్తారు. మరోవైపు సమీక్షలో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అందించే సాయంపైనా అధికారులతో చర్చించారు. ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో కలిపి... కొత్త పథకం రూపొందించేందుకు సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

## ఉప ఎన్నికలను రద్దు చేసి మళ్లీ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 12**

పులివెందుల నియోజకవర్గంలోని ఒక చిన్న జడ్పీటీసీ సీటును లాక్కునేందుకు, రాజంపేటలో మరో చిన్న ఒంటిమిట్ట జడ్పీటీసీ సీటును బలవంతంగా చెరబట్టేందుకు ఒక గూండా మాదిరిగా చంద్రబాబు అరాచకాలు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారంటూ వైసీపీ అధినేత జగన్ ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని రౌడీల రాజ్యం దిశగా నడిపిస్తున్నారని, ముఖ్యమంత్రిగా తనకున్న అధికారాన్ని దుర్వినియోగంచేస్తూ, అధికారులను చెప్పుచేతల్లోకి తీసుకుని, పోలీసులను వాడుకుని, ఈ ఎన్నికను తీవ్రవాదుల మాదిరిగా హైజాక్ చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా గాయపరిచిన ఈరోజు నిజంగా ఒక బ్లాక్ డే అని జగన్ అభివర్ణించారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేయాలని, కేంద్ర బలగాల ఆధీనంలో తిరిగి ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

**పోలీసుల సాయంతో రిగ్గింగ్**

చంద్రబాబు ప్రభుత్వం క్షుద్ర రాజకీయానికి తెరలేపిందని జగన్ విమర్శించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఓటర్లకు దూరంగా మార్చారని ఆరోపించారు. "నిన్న రాత్రి నుంచే బయట ప్రాంతాలకు చెందిన వందలాది మంది టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లోకి చొరబడి, తెల్లవారుజాము నుంచే బూత్‌లను ఆక్రమించుకున్నారు. మా ఏజెంట్లపై, మహిళలపై దాడులు చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి తరిమికొట్టారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కుని దొంగ ఓట్లు వేయించారు," అని జగన్ వివరించారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే టీడీపీ నేతల అక్రమాలకు దగ్గరుండి కాపలా కాశారని, డీఐజీ కోయ ప్రవీణ్ వంటి అధికారులు ఈ అక్రమాలను ప్రోత్సహించారని ఆయన ఆరోపించారు.

**పాలనలో విఫలమయ్యే ఈ అరాచకాలు**

తన 15 నెలల పాలనలో చంద్రబాబు అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారని, ప్రజల మద్దతు కోల్పోయారనే భయంతోనే ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు. "వ్యవసాయం, విద్య, వైద్యం వంటి రంగాలను నాశనం చేశారు. విద్యార్థులకు ట్యాబులు, విద్యా దీవెన వంటి పథకాలను రద్దు చేశారు. కరెంట్ ఛార్జీల బాదుడు, ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. ఇలాంటి పాలన చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు ఎందుకు ఓట్లు వేస్తారు? ఆ నమ్మకం లేదు కాబట్టే ఈ అరాచకాలకు దిగారు," అని ఆయన అన్నారు.

**ఎన్నికలు రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలి**

రెండు చిన్న జడ్పీటీసీ స్థానాల కోసం ఇంతగా దిగజారాల్సిన అవసరం ఏముందని జగన్ ప్రశ్నించారు. 2017 నంద్యాల ఉప ఎన్నికలో కూడా ఇలాగే అక్రమాలు చేసి గెలిచినా, ఏడాదిన్నర తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టీడీపీని చిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. పులివెందుల ప్రజలు కూడా భవిష్యత్తులో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ ఎన్నికల అక్రమాలపై తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఈ అన్యాయాన్ని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

## 30 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యం గెలిచింది

**పులివెందుల- సూర్య వాస్తవం, ఆగస్టు 12**

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ జరిగింది. దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పులివెందులలో ఈసారి జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని తెలిపారు. దశాబ్దాల తర్వాత పులివెందుల ప్రజలు ఎలాంటి భయాలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వ్యాఖ్యానించారు. గత 30 సంవత్సరాలుగా పులివెందులలో భయానక వాతావరణం ఉండేదని, కానీ ఈ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు వేయడం గొప్ప మార్పుకు సంకేతమని లోకేశ్ పేర్కొన్నారు. స్వేచ్ఛగా ఓటు వేసిన పులివెందుల ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ వైఖరిని ఎండగడుతూ, "వైసీపీ మూర?త్వానికి మరణం లేదని మరోసారి రుజువైంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలను సక్రమంగా నిర్వహించడమే తప్ప, ప్రజలను భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకోవడం కాదని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిందని, ప్రస్తుతం ప్రజలు నిర్భయంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించగలుగుతున్నారని లోకేశ్ పేర్కొన్నారు.

## ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచి పని చేసేలా చూడాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. రానున్న మూడు రోజుల పాటు అన్ని శాఖల ఉద్యోగుల సెలవులను రద్దు చేయాలని ఆయన ఆదేశించారు. ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ఎయిర్‌లిఫ్టింగ్ కోసం హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంఛార్జ్ మంత్రులు, అధికారులను ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో అధికారులు నిత్యం సమన్వయం చేసుకోవాలని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాలకు సిబ్బందిని ముందుగానే పంపించాలని సూచించారు. రెడ్ అలర్ట్ జారీ చేయబడిన జిల్లాల్లో సీనియర్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలని ఆయన అన్నారు. వర్షాలు, వరదల గురించిన సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వరదలపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో వరదల పరిస్థితిపై హైడ్రా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యాసంస్థలకు సెలవుల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రాణ, ఆస్తి, పశు సంపద నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 12:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతి సహా, వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి పి.నారాయణ, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో పాటు రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి నిర్మాణం జరగాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానిలో ఎల్పీఎస్ లే అవుట్లలో అభివృద్ధి పనుల పురోగతి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులు, న్యాయమూర్తుల నివాస భవనాలు, రహదారులు, డక్ట్ లు లాంటి ట్రంక్ ఇన్‌ఫ్రా, వరద నియంత్రణ పనులు జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాజధానిలో ప్రస్తుతం ప్రస్తుతం రూ.50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని 74 పనులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. కాంట్రాక్టు సంస్థలు ఆయా పనుల్ని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని తేల్చి చెప్పారు. రాజధానిలో చేపడుతున్న నిర్మాణ పనుల ప్రగతి ప్రజలకు కనిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ నెలా అమరావతి పనుల పురోగతిపై సమీక్ష చేస్తానని సీఎం అన్నారు. సమయం ప్రకారం పనులు పూర్తి కాకపోతే ఎందుకు కాలేదన్న అంశంపై సదరు కాంట్రాక్టు సంస్థతో పాటు అధికారులు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. దీంతో పాటు రియల్ టైమ్ లో పనుల పురోగతిని కూడా పర్యవేక్షిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఆటో పైలట్ మోడ్ లో పనులు జరగాలని సూచించారు.

**రైతులకు ఇబ్బంది లేని రీతిలో ప్లాట్ల బదిలీ**


రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయంలో రైతుల విజ్ఞప్తులను పరిశీలించి మాస్టర్ ప్లాన్ కూడా ప్రభావితం కాకుండా ఆయా సమస్యల్ని పరిష్కరించాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారాయణ వారం రోజుల్లోగా ఈ అంశాన్ని కొలిక్కి తెస్తామని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని పనులు జరగక పోవటంతో నిర్మాణానికి తెచ్చిన ఇనుము, సామాగ్రి తుప్పు పట్టి పోయిందని కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. నిర్మాణం కోసం సేకరించిన ఇసుక నిల్వల్ని కూడా గత పాలకులు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఇసుకను భర్తీ చేయాల్సిందిగా మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

**భూములు కేటాయించిన సంస్థలకు వేగంగా అనుమతులు**

రాజధాని అమరావతిలో కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్న వివిధ సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బిట్స్ పిలానీ, ఎక్స్ ఎల్ఆర్ఐ తదితర సంస్థలకు త్వరితగతిన భూమిని కేటాయించాలని సూచించారు.

## సంపాదకీయం


# భారతం... చాణుక్య వ్యూహం




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50శాతం టారిఫ్‌లు విధించాడు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిషేధించాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్‌ను శత్రు దేశంగా చూస్తున్నారనే సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ తన సంప్రదాయ బహుముఖ విదేశాంగ విధానాన్ని ఉపయోగిస్తూ, రష్యా, చైనాలతో సంబంధాలను బలోపేతం చేస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, ఆగస్టు 31న ప్రధాని నరేంద్ర మోదీ చైనా సందర్శన, కేంద్ర మంత్రులు జైశంకర్, రాజ్‌నాథ్ సింగ్‌ల ఇటీవలి చైనా పర్యటనలు ఈ వ్యూహాత్మక దృక్పథాన్ని సూచిస్తున్నాయి. పంచతంత్ర నీతి ప్రకారం భారత్ అమెరికా శత్రుదేశాలను ఏకం చేస్తోంది.ట్రంప్ భారత్‌పై 50% టారిఫ్‌లు విధించడం, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపాలని ఒత్తిడి చేయడం ద్వారా భారత్?అమెరికా సంబంధాలు గణనీయమైన సవాలును ఎదుర్కొంటున్నాయి. భారత్ రష్యా చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్ యుద్ధానికి ఆర్థిక సహాయం చేస్తున్నాయని ట్రంప్ ఆరోపించారు. అయితే, భారత్ ఈ ఆరోపణలను “అన్యాయమైనవి, అసమంజసమైనవి” అని తిరస్కరించింది, రష్యా చమురు కొనుగోళ్లు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం కాదని, ఇది జాతీయ ఇంధన భద్రతకు కీలకమని స్పష్టం చేసింది. 2024లో భారత్?అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 190 బిలియన్లు కాగా, ఈ టారిఫ్‌లు 64 బిలియన్ల ఎగుమతులను ప్రభావితం చేయవచ్చని అంచనాఇదిలా ఉంటే ట్రంప్ బ్రిక్స్ దేశాలను (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) “యాంటీ?అమెరికన్” బ్లాక్‌గా భావిస్తున్నారు, ఇది డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిక్స్ సభ్య దేశాలపై అదనంగా 10% టారిఫ్‌లు విధించాలనే ట్రంప్ బెదిరింపు, భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేసే అవకాశం ఉంది. ఈ ఒత్తిడి భారత్‌ను తన బహుముఖ విదేశాంగ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రేరేపిస్తోంది.భారత్?రష్యా సంబంధాలు “సమయ పరీక్షిత, విశ్వసనీయ” భాగస్వామ్యంగా కొనసాగుతున్నాయి. 2023?24 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 65.7 బిలియన్ డాలర్లకు చేరింది, ఇందులో రష్యా నుంచి 61.44 బిలియన్ డాలర్ల దిగుమతులు (ప్రధానంగా చమురు) ఉన్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది చివరలో భారత్ సందర్శనకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, రష్యా?ఇండియా?చైనా (ఆర్ఐసీ) త్రికోణ సహకారం ప్రధాన అంశాలుగా ఉంటాయని భావిస్తున్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించడం ద్వారా జాతీయ ఇంధన భద్రతను కాపాడుకుంటోంది, ఇది ట్రంప్ ఒత్తిడిని ఎదుర్కొనే వ్యూహంగా కనిపిస్తోంది.2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ, ఇటీవలి కాలంలో సాధారణీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2024 అక్టోబర్‌లో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమై, సరిహద్దు సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 31న మోదీ చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సుకు హాజరవుతారు, ఇది ఏడేళ్లలో ఆయన తొలి చైనా సందర్శన. ఈ సందర్శనలో ట్రంప్ టారిఫ్‌లు, ద్వైపాక్షిక వాణిజ్యం, సరిహద్దు సమస్యలు ప్రధాన అంశాలుగా ఉంటాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆగస్టు 18న భారత్ సందర్శనలో ధోవల్‌తో సరిహద్దు సమస్యలపై చర్చిస్తారని తెలుస్తోంది.బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా) గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ వేదికగా ఉద్భవించాయి. ట్రంప్ బ్రిక్స్‌ను యాంటీ?అమెరికన్ బ్లాక్‌గా ఆరోపిస్తున్నప్పటికీ, భారత్ ఈ సమూహంలో తన పాత్రను బలోపేతం చేస్తోంది. బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ కరెన్సీలపై చర్చిస్తున్నాయనే ట్రంప్ ఆందోళన, భారత్‌ను ఈ సమూహంలో మరింత చురుకుగా పాల్గొనేలా ప్రేరేపిస్తోంది. అయితే, భారత్ బ్రిక్స్ కరెన్సీ ఆలోచనను ప్రత్యక్షంగా సమర్థించలేదు, దాని బహుముఖ విధానాన్ని కొనసాగిస్తోంది. రష్యా? ఇండియా?చైనా (ఆర్ఐసీ) త్రికోణం 1990లలో స్థాపించబడినప్పటికీ, ఇటీవలి ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో దీని పునరుజ్జీవనం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మూడు దేశాలు అమెరికా ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి, ఇది వాటిని ఒకదానికొకటి చేరువ చేస్తోంది. మోదీ, పుతిన్, జిన్‌పింగ్ సమావేశం ఎస్‌సీవో సదస్సులో జరిగితే, అమెరికా దూకుడు విధానాలకు చెక్ పెట్టే వ్యూహాత్మక సహకారం ఏర్పడవచ్చు. ఈ త్రికోణం భారత్‌కు రష్యా, చైనాలతో వాణిజ్య, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసే అవకాశాన్ని ఇస్తుంది, అదే సమయంలో అమెరికాతో సంబంధాలను సమతుల్యం చేస్తుంది.భారత్ తన “నాన్?అలైన్‌మెంట్” విధానాన్ని కొనసాగిస్తూ, అమెరికా, రష్యా, చైనాలతో సంబంధాలను సమతుల్యం చేస్తోంది. ట్రంప్ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపలేదు, ఇది జాతీయ ఆర్థిక, ఇంధన భద్రతకు కీలకమని పేర్కొంది. ప్రధాని మోదీ రైతులు, చేపల వేటగాళ్లు, డైరీ రైతుల ప్రయోజనాలను రాజీ పడనని స్పష్టం చేశారు, ఇది అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయ రంగంపై ఒత్తిడిని తిరస్కరించే సంకేతం. ఈ విధానం భారత్ యొక్క స్వాతంత్ర్య దృక్పథాన్ని, జాతీయ ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది.ట్రంప్ టారిఫ్‌లు, భారత్?రష్యా?చైనా సహకారం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ యొక్క ఎస్‌సీవో, బ్రిక్స్ సదస్సులలో చురుకైన పాత్ర, ఎస్‌సీవో త్రికోణం యొక్క పునరుజ్జీవనం అమెరికా యొక్క ఏకపక్ష విధానాలకు సవాలుగా మారవచ్చు. మాజీ యూఎస్ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ జాన్ బోల్టన్ హెచ్చరించినట్లు, ట్రంప్ టారిఫ్‌లు భారత్‌ను రష్యా, చైనాలతో మరింత చేరువ చేయవచ్చు, ఇది అమెరికా యొక్క ఆసియా వ్యూహానికి వ్యతిరేక ఫలితాలను ఇవ్వవచ్చు.

# 225 చుట్టూ రాజకీయం

విజయవాడ – సూర్య వాస్తవం



రాష్ట్రంలో రాజకీయాలు కీలక మలుపులు తిరుగుతున్నాయి. కూటమి దూకుడు మీద ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం దిశగా ప్రణాళికలు వేస్తోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా వైసీపీ హయాంలో భారీ ఎత్తున అవినీతి, కుంభకోణాలు జరిగాయని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇంకోవైపు అవన్నీ రాజకీయ కక్షపూరిత కేసులని వైసీపీ చెప్పు కొస్తోంది. అయితే లోలోపల మాత్రం ఎవరికీ వారే పట్టు బిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2029 ఎన్ని కలను టార్గెట్ చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో జగన్మో హన్ రెడ్డికి అవకాశం ఇవ్వకూడదని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ బలంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకున్నారు. దీంతో ఏపీలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఎత్తుకు పైఎత్తులు కొనసాగుతున్నాయి.అయితే వచ్చే ఎన్నికల నాటికి ఏపీవ్యాప్తంగా నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజక వర్గాల పెంపు విషయాన్ని ప్రస్తావించారు. ఏపీలో మరో 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగు తాయని అంచనా వేశారు. తద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య 225 కు చేరుకోనుంది. అయితే నియోజకవర్గాల పెంపును దృష్టిలో పెట్టుకొని ప్రధాన రాజకీయ పార్టీలు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళుతున్నాయి. ఈ విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. అయితే నియోజక వర్గాల విభజనతో పాటు పెంపునకు సంబంధించి అధికార కూటమి మాట చెల్లుబాటు అయ్యే అవకాశం ఉంది. వారికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్వి భజన ఉండే అవకాశం ఉంటుంది. చివరిసారిగా 2009 లో నియోజకవర్గాల పునర్విభజన సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా జరిగింది. ఇప్పుడు కూడా టిడిపి కూటమికి లాభం చేకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉంది. 135 అసెంబ్లీ సీట్లలో ఆ పార్టీ విజయం సాధించింది. అయితే ఇంకా భవిష్యత్తు వ్యూహరచన లో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను భారీగా ఆకర్షించగలిగింది. కేవలం నియోజకవర్గాల పునర్విభజన దృష్టిలో పెట్టుకొని వైసీపీలో ఉన్న బలమైన నేతలను టిడిపిలోకి రప్పించింది. అనివార్య కారణాలతో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారిస్తే ప్రత్యామ్నాయంగా కొంతమంది నేతలను సిద్ధం చేసుకుంది. నియోజకవర్గాల పెంపుతో లభించే స్థానాలకు ముందస్తుగానే నేతలను సంసిద్ధులను చేసింది తెలుగు దేశం పార్టీ. ఒకటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బ తీయడం.. రెండు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వైసీపీ నేతలను ఆకర్షించడం.. ఇలా ద్విముఖ వ్యూహంలో తెలుగుదేశం పార్టీ ఉంది.జనసేనకు సంబంధించి నియోజకవర్గాల పెంపు పై కూడా దృష్టి పెట్టింది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో సూపర్ విక్టరీ కొట్టింది జనసేన. 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి శతశాతం విజయం సాధించింది. వచ్చే ఎన్నికల నాటికి మరిన్ని సీట్లు పొందాలని చూస్తోంది. నియోజకవర్గాల పెంపులో భాగంగా.. పెరిగిన సీట్లలో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలన్న ఆలో చనలో ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని చూస్తోంది. అందుకే బలమైన నేతలను ముందుగా పార్టీలోకి రప్పించింది. నియోజక వర్గాల పెంపు పై ఒక అంచనాకు వస్తే మరింత మంది నేతలను పార్టీలోకి రప్పించేందుకు వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా ఈసారి జనసేన రాయలసీమ జిల్లాలపై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి భిన్నంగా ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు తమ వైపు చూస్తారని అంచనా వేస్తున్నారు. ఒకేసారి 50 నియోజకవర్గాల పెంపుతో తమకు కలిసి వస్తుందని ధీమాతో ఉన్నారు. పొత్తులో భాగంగా చాలామంది నేతలకు సీట్లు దక్కవని.. అటువంటి వారంతా వైసిపి వైపు చూడడం ఖాయమని భావిస్తున్నారు. ఇలా నియోజకవర్గాల పెంపు పై అన్ని పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. అయితే అసలు నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందా? నియోజకవర్గాల పెంపు ఉంటుందా? అన్నదానిపై స్పష్టత లేదు.

# ఏపీకి ఫుల్ కనెక్టివిటీ



విజయవాడ – సూర్య వాస్తవం

ఏపీని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని ఆలోచన చేస్తోంది ప్రభుత్వం. ఎటువైపు వెళ్లినా రోడ్డు, రైలు, విమాన సర్వీసులు ఉండాలన్నది సీఎం చంద్రబాబు ప్రధాన కోరిక. ఆ విధంగా అడుగులు వేస్తున్నారు. ఓ వైపు రోడ్లు-ఎయిర్‌పోర్టుల పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇంకోవైపు రైల్వే శాఖ అధికారులు కొత్త ప్రాజెక్టులపై ఫోకస్ చేశారు. ఏపీకి కొత్త రైల్వే జోన్ అపాయింటెడ్ డే కోసం తెర వెనుక వేగంగా పనులు జరుగుతున్నాయి.

ప్రస్తుతం కొత్త జోన్ పీహెచ్ఓడీల నియామకం జరుగుతోంది. జనవరిలో జోన్ నోటిఫికేషన్ రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇదెలా వుంచితే ఏపీలో వివిధ మార్గాల్లో కొత్త రైల్వేలైన్ల నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతమున్న లైన్లకు అదనంగా మరికొన్ని కలిపి 1,336.60 కిలోమీటర్ల మేరా లైన్ల నిర్మాణానికి ఆ శాఖ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. వీటికి దాదాపు రూ. 33 వేల కోట్ల వ్యయం అవుతుందని ఓ అంచనా. వాటిలో కొత్త లైన్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భద్రాచలం-కొవ్వూరు కొత్త లైన్ అందులో ఉంది. ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ-ప్రశాంతి నిలయం కొత్త లైన్ అంటే 100 కిలోమీటర్లు ప్రతిపాదన చేశారు. దీనికితోడు అట్టిపట్టు-పుత్తూరు కొత్త లైన్ ఇది ఏపీ పరిధిలో ఉండనుంది. వెస్ట్ గోదావరి జిల్లాలో నిడదవోలు నుంచి విశాఖ దువ్వాడ వరకు మూడో, నాలుగు లైన్ల నిర్మాణాల కోసం డీపీఆర్ చేసిన వాటిలో ఉన్నాయి. అలాగే నల్లపాడు-కృష్ణ కెనాల్ స్టేషన్ల మధ్య మూడు-నాలుకతో లైన్, ఓబుళవారి పల్లి-రేణిగుంట-గుంతకల్లు మధ్య మూడు, నాలుగు లైన్ ఉన్నాయి. దీనికి తోడు ఇందుపల్లి-దుగ్గిరాల వద్ద బైపాస్ లు, రేణిగుంట వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి, బళ్లారి నుంచి బిక్కజాజూర రెండో లైన్ కు సంబంధించిన డీపీఆర్‌ను అధికారులు బోర్డుకు పంపారు. అక్కడి గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఏపీలో రైల్వేకి చూడాల్సిన అవసరం లేదన్నది ప్రభుత్వ ఆలోచన. ఇవికాకుండా కొత్తగా రానున్న రైళ్లను విశాఖతోపాటు తిరుపతి నుంచి పెట్టాలని భావిస్తోంది. డీపీఆర్ పంపిన ప్రాజెక్టులకు సంబంధించి కొంతభాగం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు భరించాలి. లేకపోతే భూములను సేకరించి ఇవ్వాలన్నది బోర్డు మాట. కాకపోతే విభజన చట్టం ప్రకారం ఈ ప్రాజెక్టులను రైల్వే నిధులతో చేట్టాలని దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. వీటిలో కొన్నింటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశముందని కొందరు అధికారులు.

# కానుకలతో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

పిఠాపురం – సూర్య వాస్తవం



రాజకీయాల్లో ట్రెండ్ మారింది. ఇన్నాళ్ల మాదిరిగా ఏడాదికి ఒకసారి నియోజకవర్గానికి వెళ్తామంటే ఓటర్లు నుంచి నిరసనలు తప్పదు. ఫలితంగా అధికార ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు. దీన్ని గమనించిన ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ పార్టీల నేతలు రూటు మార్చారు. నిత్యం ప్రజలతో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండాలని పదే పదే అగ్రనేతలు చెబుతున్నారు. ఈ ట్రెండ్‌ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాగానే ఫాలో అవుతున్నారు. ఒకవేళ బిజీ వల్ల నియోజకవర్గానికి వెళ్లకపోయినా నిత్యం అక్కడి ప్రజలతో టచ్‌లో ఉంటున్నారు. సమయం, సందర్భం బట్టి రకరకాల కానుకలను ప్రజలకు అందజేస్తున్నారు. శనివారం రాఖీ పండగ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలో 1500 మంది వితంతు మహిళలకు చీరలు పంపారు. వాటిని నియోజకవర్గంలో నేతలు మహిళలకు అందజేశారు. వాటిని అందుకున్న మహిళలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. రక్షాబంధన్ రోజు ఊహించని కానుక డిప్యూటీ సీఎం నుంచి రావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్నట్లు మొన్న అల్లూరు జిల్లా టూర్‌కి వెళ్లారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఆ గిరిజన గ్రామానికి తన తోటలో పడిన మామిడిపండ్లను పంపి అక్కడి ప్రజలకు అందజేశారు. దీంతో ఆ గ్రామ ప్రజలు పవన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞత తెలిపారు. ఓ వైపు సినిమాలు, మరోవైపు అధికారులు, ఇంకోవైపు నేతల వరుస సమావేశాలతో నిత్యం బిజీగా ఉంటున్నారు పవన్ కల్యాణ్. దీంతో నియోజకవర్గానికి ఆయన దూరమయ్యారనే వాదన లేకపోలేదు. ఇప్పుడు ఆ గ్యాప్‌ని ఫుల్ చేసుకునే పనిలో పడినట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో రాఖీ పండగ నేపథ్యంలో నియోజకవర్గంలో 1500 మందికి చీరలు పంపారని అంటున్నారు. రేపటి రోజున డిప్యూటీ సీఎం ప్రజలకు ఇవ్వబోయే గిఫ్ట్ ఏంటంటూ చర్చించుకోవడం మొదలైంది. ఒకవిధంగా చెప్పాలంటే ఆ తరహా పద్దతి ఇప్పటివరకు ఏ రాజకీయ నేతలు పాటించిన సందర్భాలు లేవు. కానీ పవన్ అలా కాదని అంటున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనించిన రాజకీయ విశ్లేషకులు పవన్ కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నారని అంటున్నారు. రాబోయే రోజుల్లో పవన్ నుంచి ప్రత్యేక కానుక ఏ ప్రాంతానికి వెళ్తుందో చూడాలి. పిఠాపురం ఆడపడుచులకు రాఖీ కానుక పంపించిన పిఠాపురం ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురానికి చెందిన 1,500 మంది వితంతు మహిళలకు చీరలు పంపారు. పవన్ కళ్యాణ్ పంపిన ఊహించని రక్షాబంధన్ కానుకకి ధన్యవాదాలు తెలిపారు.

## కంబదూరు-రామగిరి మీదుగా

# రైల్వే లైన్ ఏర్పాటు చేయండి



**రాప్తాడు– సూర్య వాస్తవం, ఆగస్టు 12:** రాప్తాడు ధర్మవరం నియోజకవర్గాలలోని రైల్వే సమస్యలను ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న తెలియజేశారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ కోసం సహచర ఎమ్మెల్యేలతో కలిసిన ఢిల్లీకి వెళ్లిన పరిటాల సునీత శ్రీరామ్‌లు మంగళవారం కేంద్ర రైల్వే మంత్రి సోమన్నను కలిశారు. సోమన్న ఆహ్వానం మేరకు ఎంపీలు పార్థసారథి లక్ష్మీ నారాయణ ఎమ్మెల్యేలు పరిటాల సునీత కాలువ శ్రీనివాసులు సురేంద్ర బాబు వెంకటేశ్వర ప్రసాద్ ఎమ్. ఎస్.రాజు ధర్మవరం టీడీపీ ఇంచార్జి పరిటాల శ్రీరామ్ పరిటాల సిద్ధార్థ మంత్రి ఇంటికి వెళ్లి అల్పాహార విందు చేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు సానా సతీష్ టిడిపి ఎంపీ హరీష్ బాలయోగిని కూడా కలిశారు. ఇండియా గేట్ రాష్ట్రపతి భవన్ ను సందర్శించారు. ఎంపీలు ఎమ్మెల్యే లను సునీత కుమారులను రైల్వే మంత్రి సోమన్న ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. ఇదే సంధర్భంలో రాప్తాడు ధర్మవరం నియోజకవర్గాల్లోని రైల్వే సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం నియోజకవర్గంలో ఉన్న రైల్వే విభాగానికి సంబంధించిన అంశాలపై వినతి పత్రం అందజేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171/600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం చుట్టుపక్కల ఇందిరమ్మ కాలనీ కేతిరెడ్డి కాలనీ టిడ్కో గృహాలు రేగాటిపల్లి గ్రామాల ప్రజలు రైతులు వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. లెవల్ క్రాసింగ్ గేట్ ఏర్పాటు చేయకపోవడం వలన పెద్దవాళ్లు స్కూల్ పిల్లలు రోజువారి కూలీలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో కేతిరెడ్డి కాలనీ వద్ద రైలు పట్టాలపై కొన్ని దుర్ఘటనలు జరిగి 5 మంది చనిపోయారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఇక్కడ లెవల్ క్రాసింగ్ గేట్ లేక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేశారు. కదిరిదేవరపల్లి రైలులో పావగడ కళ్యాణదుర్గం నియోజకవర్గాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కంబదూరు కళ్యాణదుర్గం రాయదుర్గం బళ్లారి గుంతకల్లు అనంతపురం మీదుగా ధర్మవరంకు 260 కిలోమీటర్లు దూరం చుట్టి రావాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా కంబదూరు నుంచి పేరూరు రామగిరి మీదుగా నాగసముద్రం గేట్ వరకు కొత్త రైల్వే లైన్ వేస్తే సుమారు 200 కిలోమీటర్లు పైగా దూరం తగ్గడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కావున రామగిరి మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత శ్రీరామ్ విజ్ఞ ప్తులపై మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. వెంటనే రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి వీటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

## పంద్రాగస్టున పరేడ్ సమర్ధవంతంగా నిర్వహించండి : జిల్లా ఎస్పీ





**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో ఆగస్టు 15వ తేదీన నిర్వ హించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పరేడ్‌ను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. పంద్రాగస్టు రోజున నిర్వహించే పరేడ్ కోసం పోలీసు సాయుధ బలగాలు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో సాధన చేస్తున్నాయి. జిల్లా ఎస్పీ సాయుధ బలగాల పరేడ్ సాధనను మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా సాయుధ బలగాల నుండీ గౌరవ వందనం స్వీకరించారు. ఆతర్వాత పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి సాయుధ బలగాలను నిశితంగా పరిశీలించారు. పంద్రాగస్టు రోజున సమర్ధవంతంగా పరేడ్ నిర్వహించేందుకు అవసరమైన మెళకువలు, సూచనలు చేశారు. ఏ.ఆర్ సాయుధ పోలీసు బలగాలతో పాటు డాగ్ స్క్వాడ్ మరియు ఎన్ సి సి విద్యార్థులు సాధన చేశారు. జాతీయ సమైక్యత, దేశభక్తి భావం వెల్లువిరిసేలా, నలుదిశలా వ్యాపించేలా పరేడ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీతో పాటు ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## వదినకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే



**రాయదుర్గం – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ నాయకులు కాపు రామచంద్రారెడ్డి వదినకు నివాళులర్పించారు. పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన కాపు లక్ష్మీదేవి (వదిన) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కాపు భారతి చెర్లోపల్లి గ్రామానికి చేరుకుని మృతురాలు కాపు లక్ష్మీదేవికి నివాళులర్పించారు. మృతురాలు లక్ష్మీదేవి మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కు అన్న భార్య కావడంతో ఉదయం నుండి కాపు కుటుంబ సభ్యులందరూ గ్రామానికి చేరుకొని అంత్యక్రియలు, మాజీ ఎమ్మెల్యే దగ్గరుండి చూసుకోవడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే అన్న కాపు రామ రెడ్డి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించి. ఆ కుటుంబానికి అండగా ఉంటామని కాపు రామచంద్రారెడ్డి దంపతులు తెలిపారు. అనంతరం లక్ష్మీ దేవి అంతిమయాత్రలో కాపు దంపతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై

# రైతులు అవగాహన పెంచుకోవాలి

### - నాబార్డ్ డిడియం అనురాధ




**కదిరి – సూర్య వాస్తవం, ఆగస్టు 11:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రవేశపెడుతున్న పథకాలపై రైతులు అవగాహన పెంచు కోవాలని నాబార్డ్ డీడీఎం అనురాధ పేర్కొన్నారు. కదిరి మండలం గొల్లోళ్ళ చెరువు సహకార సంఘం పరిధిలోని ముత్యాల చెరువు రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డి డి యం మాట్లాడారు. గొల్లోళ్ళ చెరువు సహకార సంఘం అధ్యక్షులు నాగూరి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాంక్ అధికారులు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిడిఎం అనురాధ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా అనేక రకాల పథకాలను ప్రవేశపెడుతోందని పేర్కొన్నారు. రైతులు ఈ పథకాలను సకాలంలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో పయ నించాలని ఆయన సూచించారు రైతులకు పంట రుణాలతో పాటు ఎల్టి రుణాలు కూడా ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు డిసిసిబి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు ఇన్సూరెన్స్ పథకాలు కూడా ఉన్నాయని వివరించారు ప్రమాద బీమా రూపే కార్డుతో పాటు మరికొన్ని ఇన్సూరెన్స్ పథకాలు ఉన్నాయని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డిసిసిబి డీజీఎం రాంప్రసాద్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాల పైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం రైతులకు ఎటువంటి రుణ సౌకర్యాలైన కనిపిస్తోందని అన్నారు ప్రధానంగా ప్రభుత్వాలు ప్రవేశపడుతున్న ప్రతి ఒక్క పథకంపై రైతులు అవగాహన కలిగి ఉంటే చాలా ఉపయోగాలు ఉన్నాయని అన్నారు సహకార సంఘం అధ్యక్షులు నాగూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు చిన్నచిన్న బ్యాంకులు కూడా దృష్టిలో ఉంచుకొని వాటి ద్వారా వచ్చే ఫలాలను కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు పెద్దపెద్ద బ్యాంకుల్లో కాకుండా చిన్న బ్యాంకుల్లో కూడా రైతులకు అనేక పథకాలు అందు బాటులో ఉన్నాయని వివరించారు.

ఈ కార్యక్రమం లో డిసిసిబి, ఆప్కాబ్ అధికారులు డిప్యూటీ రిజిస్టర్ ఫణి రాజ్, కదిరి ఏ డి సి సి బ్యాంక్ మేనేజర్ మహాలక్ష్మి టిడిపి కదిరి మండలం కన్వీనర్ చెన్నకేశవులు టిడిపి నాయకులు రామచంద్ర నాయుడు రామాంజుల రెడ్డి ఉపేందర్ రెడ్డి మాజీ సర్పంచ్ కుపేందర్ రెడ్డి పెద్దిరెడ్డి సిబ్బంది ఆడిటర్ షాహిద్ భాష హనుమంత రెడ్డి భయ్యా రెడ్డి వీరేష్ ఫక్రుద్దీన్ శ్రీనివాసులు రైతులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం

### - ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్
### - ఏపీఎస్ఆర్టిసి ఉపాధ్యక్షులు పీఎస్ మునిరత్నం



**కుప్పం– సూర్యవాస్తవం, ఆగస్టు 12:** రాష్ట్రంలో ఉన్న నాయి బ్రాహ్మణులకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం లు పేర్కొన్నారు. మంగళవారం కుప్పం పట్టణంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణులు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం బస్టాండులో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట మేరకు సీఎం చంద్రబాబు నాయుడు నాయి బ్రాహ్మణులు నిర్వహించుకునే సెలూన్ షాపులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో నాయి బ్రాహ్మణులకు ప్రతినెలా దాదాపు 2000 రూపాయలు విద్యుత్ భారం తగ్గుతుందని వారు పేర్కొన్నారు. కుప్పం కు చెందిన వైద్యం శాంతారాం పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు టిటిడి బోర్డు సభ్యుడిగా తగు స్థానం కల్పించారని బీసీలకు ఎన్నటికీ అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీయేనని వారు పేర్కొన్నారు నాయి బ్రాహ్మణులు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం చెందాలని వారు కోరారు. కార్యక్రమంలో కడ సభ్యులు రాజ్ కుమార్, డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, జనసేన నేత నరేష్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కన్వీనర్ ఆర్ చంద్రశేఖర్, రామకుప్పం టిడిపి అధ్యక్షుడు ఆనంద రెడ్డి. కుప్పం నియోజకవర్గ నాయి బ్రాహ్మణ అధ్యక్షుడు జ్యోతీశ్వర్, నాలుగు మండలాల నాయి బ్రాహ్మణ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.





## రాయచోటి మునిసిపల్ కమిషనర్‌గా

# బాధ్యతలు స్వీకరించిన రవి




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** రాయచోటి మునిసిపల్ కమిషనర్‌గా జి.రవి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదీలలో భాగంగా రాయచోటి కమీషనర్‌గా పని చేస్తున్న వాసు బాబు నెల్లూరు కార్పొరేషన్ కార్యాల యంలో టిపిఆర్వో గా బదిలీ కావడంతో ఏపి గ్రీనరి, బ్యూటిఫికేషన్ లో జనరల్ మేనేజర్ గా పనిచేస్తూ మునిసిపల్ కమిషనర్‌గా రాయచోటికి బదిలీపై వచ్చారు. ఈయన గతంలో తాడిపత్రి, మదనపల్లి, ఆముదాలవలస మునిసిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాయచోటి మునిసిపాలిటీని శానిటేషన్ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, స్వచ్ఛ రాయచోటి లక్ష్యమని పేర్కొన్నారు. మునిసిపల్ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో రాయచోటి మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## మున్సిపాలిటీకి ఆదాయం

# పెంచేలా చర్యలు తీసుకోవాలి

### - మల్టిపుల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదన చర్యలు
### - జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



**శ్రీసత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** మున్సిపాలిటీకి ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు కదిరి మున్సిపల్ అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ కదిరి పట్టణములోని పాత మునిసిపల్ కార్యాలయ భవనమును మరియు హిందూపురంరోడ్డులో పాత మునిసిపల్ ఉన్నత పాఠశాల భవనము శిథిలావస్థ దశలో ఉన్నందున వాటిని పడగొట్టి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించుటకు, హిందూపురం రోడ్డు నందు శిథిలావస్థ దశలో ఉన్న పాత మునిసిపల్ ఉన్నత పాఠశాల భవనమును పడగొట్టి మల్టి లెవల్ పార్కింగ్ నిర్మించుటకు సూచించారు. ఈ కార్యక్రమంలో కదిరి మున్సిపల్ ఛైర్పర్సన్ దిల్షాదున్నిసా, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవ్ కుమార్, కదిరి , పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ లు, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ నరసింహా మూర్తి తదితర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో 18,19న జరిగే
## బీసీ మహాధర్నాకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



**డోన్–సూర్య వాస్తవం, ఆగస్టు 12:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి బిసి కండువ వేసి మరి ఉద్యమానికి ఢిల్లీలో పార్లమెంటు సభ్యులు కేంద్ర మంత్రులను పంపించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసిన జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరావు యాదవ్ ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ యలగాల నుకానమ్మ యాదవ్ ముఖ్యంగా బిసి కండువ వేసి మరి ఆహ్వానం చేసి నందున సంతోషం ఆనందం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ బడబాగ్ని వెంకట రమణ రాజు, రాష్ట్ర కన్వీనర్ తిరుమలేష్ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నీశెట్టి లక్ష్మణరావు, యువన టౌన్ అధ్యక్షులు కుట్టి .నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 18-8-2025 మరియు 19-8-2025 ప్రతిష్టాత్మకంగా చేపట్టే జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ స్థాయి హక్కుల సాధన కోసం ఢిల్లీలో ఏర్పాటు చేసే , మహాధర్నా సెమినార్ రెండు రోజుల కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కేంద్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు, పార్లమెంటు సభ్యులను ఆహ్వా నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ బిసిలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో ఇంకా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీకి బిసిలే వెన్నుముక అని మిమ్మల్ని రాజ్యాధికారానికి దగ్గర చేస్తూ, ఇంకా అర్థికంగా, అభివృద్ధి చేయాలని ఆలోచనలు చేస్తూ ఉంటానని అన్నారు. తప్పకుండ రెండు రోజులు మద్దతు తెలియజేస్తాము అని హామీ ఇచ్చారు. ధన్య వాదాలు తెలిపిన నూకానమ్మ యాదవ్ నాగేశ్వరావు యాదవ్

## 30 ఏళ్ళ తర్వాత
## పులివెందులలో గెలిచిన ప్రజాస్వామ్యం

**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి**



**డోన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** పులివెందుల జడ్పిటిసి ఎన్నికలు ఒక చరిత్రాత్మకమైన మలుపు తీసుకబోతుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. గతంలో పులివెందులలో నామినేషన్ వేయాలంటే ప్రాణాలు వదులుకునే పరిస్థితి ఉండేదని కానీ ఈరోజు ప్రజాస్వామ్య బద్ధంగా అక్కడ ఎన్నికలు జరిగాయని గతంలో నామినేషన్‌ను నియంత్రించి, వేసిన వారిపై దాడులు, దారుణాలు పాల్పడేవారని అన్నారు. కానీ ఆ రోజు లకు భిన్నంగా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయన్న విషయం మనమందరం గమనించాలని అన్నారు. ఈరోజు వైసీపీ నాయకులు పోలీసుల పై, ఎన్నికల కమిషన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, గత 30 ఏళ్లుగా ప్రజాస్వామ్య బద్ధంగా మీరు ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవాలు చేసుకున్నా సందర్భాలు ఉన్నాయని. కానీ నేడు ఏకగ్రీవాలకు తావు లేకుండా తెలుగుదేశంపార్టీ ప్రజాస్వామ్య విలువలకు మద్దతు ఇస్తూ పులివెందుల , ఒంటిమిట్ట జరిగే జడ్పిటిసి ఎన్నికలలో చరిత్రను తిరగరాయ బోతుందని ప్రజాస్వామ్య బద్ధంగా తెలుగుదేశం పార్టీ గెలవబోతుందని అన్నారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం



**పెళ్ళకూరు– సూర్య వాస్తవం, ఆగస్టు 12:** తిరుపతి జిల్లా పెళ్ళకూరు మండలం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ పురుగుల నిర్మూలన కార్యక్రమం కింద అంగన్వాడి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పిల్లలకు హాల్ బెంజోళ్ళు మాత్రలు పంపిణీ జరుగుతుందని ఏఎన్ఎం నాగూ రమ్మ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎంపీడీవో ప్రమీల రాణి మాట్లాడుతూ పెరుగుదల లోపం రక్త హీనత ఆకలి మందగించడం వంటి ప్రధాన కారకాలైన జీర్ణవ్యవస్థలో ఉన్న నట్టల నివారణకు ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని తెలియజేశారు ఆల్ బెండజాల్ మాత్రలు , వాటి ఉపయోగాలు, హ్యాండ్ వాష్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మించల శంకరయ్య, డాక్టర్ సుజాత, సిహెచ్ఓ శివారెడ్డి, డాక్టర్ పి.జితేంద్ర పాల్గొన్నారు.

### రామ్ నగర్, నాయక్ నగర్లలో
# రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించండి

- ఢిల్లీలో రైల్వే మంత్రి సోమన్నకు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి
- వాహనదారులు, ప్రజల సమస్యల్ని పరిష్కరించాలని కోరిన దగ్గుపాటి
- సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి సోమన్న
- కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని కలిసిన ఎమ్మెల్యే





**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** అనంతపురం నగరంలోని రామ్ నగర్, నాయక్ నగర్ లోని రైల్వే లైన్ క్రాస్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని రైల్వే మంత్రి సోమన్నకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆయన రైల్వే మంత్రి సోమన్నను ఎంపీ అంబికా, సహచర ఎమ్మెల్యేలతో కలిసి దగ్గుపాటి కలిశారు. ఈ సందర్భంగా రామ్ నగర్, నాయక్ నగర్ లో రైల్వే లైన్ క్రాసింగ్ వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వివరించారు. రామ్ నగర్ లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించినప్పటికీ.. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. సమీప కాలనీల ప్రజలు వెళ్లాలన్నా బ్రిడ్జి చుట్టి రావాల్సి వస్తోందని.. దీని వలన అదనంగా ట్రాఫిక్ సమస్య వస్తోందన్నారు. ప్రభుత్వాసుపత్రితో పాటు రామ్ నగర్, మారుతీ నగర్, అరవింద్ నగర్, కొవ్వూరు నగర్ వంటి ప్రాంతాలకు వెళ్లి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అందుకే ఇక్కడ అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే.. ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రజల ఇబ్బందులు కూడా తీరుతాయన్నారు. అలాగే నాయక్ నగర్ రైల్వే లైన్ క్రాసింగ్ వద్ద ఎలాంటి బ్రిడ్జి సౌకర్యం లేదన్నారు. ఇక్కడ ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఉండటం వలన.. గేటు పడిన ప్రతిసారి పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోతున్నాయన్నారు. దీని వలన ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అందుకే ఈ రెండు అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి అమోద ముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రైల్వే మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు.

అన్ని అంశాలు రైల్వే అధికారుల ద్వారా నివేదిక తెప్పించుకుంటానని ఎమ్మెల్యే దగ్గుపాటికి హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి కలిశారు. తదితర ఎమ్మెల్యేలతో కలిసి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి చర్చించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు అత్యంత అనువుగా రవాణా మార్గం ఉందని... ఇక్కడ పరిశ్రమల స్థాపనకు భూములు కూడా ఎక్కువగా ఉన్నాయని వివరించారు. దీనిపై పరిశీలిస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు.


## ఈ అరెస్టులు చూసి..
# వాగిన నోళ్లు మూగబోయాయా..?



- అస్రా ఆప్టికల్స్‌పై దాడి చేసింది నా మనుషులేనన్నారు
- ఓ నాయకుడు యూట్యూబ్ ఛానల్స్ ద్వారా దుష్ప్రచారం చేస్తున్నాడు
- ఇక నుంచి చిల్లర మాటలు, చిల్లర రాజకీయాలను సహించను
- త్వరలోనే అన్ని ఆధారాలతో వారి కుట్రలను బయటపెడుతాను
- బాధితులెవరైనా సరే నా వద్దకు వస్తే న్యాయం చేస్తాం
- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వార్నింగ్

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా.. దానిని నాకు ఆపాదిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని.. ఇక నుంచి వాటిని సహించేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వార్నింగ్ ఇచ్చారు. మూడు రోజుల క్రితం నగరంలోని సాయినగర్ 6వ క్రాస్ లో అస్రా ఆప్టికల్స్ పై దాడి చేసింది నా మనుషులేనని, నేనే చేయంచానని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేశారన్నారు. అయితే ఇప్పుడు పోలీసులు అసలైన నిందితులను అరెస్ట్ చేశారన్నారు. వీరిలో ఏ ఒ?క్కరు అర్బన్ నియోజకవర్గానికి చెందిన వారు కాదని.. వారు నా అనుచరులు కాదని.. కనీసం నాకు పరిచయం కూడా లేదన్నారు. సంఘటన జరిగిన వెంటనే నిష్పక్షపాతంగా విచారించి.. చర్యలు తీసుకోవాలని చెప్పామన్నారు. పోలీసులు కూడా వెంటనే స్పందించి దాడి చేసిన వారిని అరెస్ట్ చేశారన్నారు. మరి నిన్నటి వరకు నా పై దుష్ప్రచారం చేసిన వారు ఏం సమాధానం చెబుతారన్నారు. అస్రా ఆప్టికల్స్ స్థల వివాదంలో నేనున్నాని కూడా ప్రచారం చేశారన్నారు. కానీ ఇందులో మైనార్టీ కుటుంబసభ్యులు కూడా ఎమ్మెల్యేకు సంబంధం లేదని చెప్పినా.. కొందరు వ్యక్తులు పదే పదే దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు ఆ నోళ్లన్నీ మూగబోయాయా అంటూ నిలదీశారు. మా పార్టీకి చెందిన ఒక నాయకుడు రెండు మూడు యూట్యూబ్ ఛానల్స్ ద్వారా ప్రతి నిత్యం విషం చిమ్ముతున్నారన్నారు. ఇది నా ప్రతిష్టకే కాకుండా పార్టీ ప్రతిష్టకు కూడా భంగం కలిగేలా ఉన్నాయన్నారు. ఏ చిన్న వివాదం జరిగినా ఎమ్మెల్యే మనుషులు అంటూ ఆరోపణలు చేస్తున్నారని.. దీని వెనక ఎవరున్నారో నాకు తెలుసునన్నారు. ఇక నుంచి ఈ చిల్లర మాటలు, చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని దగ్గుపాటి హెచ్చరించారు. త్వరలోనే అన్ని ఆధారాలతో పార్టీ అధిష్టానంకి ఫిర్యాదు చేస్తానన్నారు. అస్రా ఆప్టికల్స్ స్థల వివాదంలో మైనార్టీ కుటుంబాన్ని త్వరలోనే కలిసి సమస్య గురించి చర్చిస్తానన్నారు. అనంతపురం నియోజకవర్గంలో గతంలో ఏ నాయకుడు సాధించని విధంగా భారీ మెజార్టీతో నాకు విజయం దక్కిందంటే.. దాని వెనుక మైనార్టీల పాత్ర ఎంతో ఉందన్నారు. నగరంలో మైనార్టీలకు చిన్న నష్టం జరిగినా సహించన న్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షపాతిగా ఉంటుందన్నారు. ఎవరైనా సరే నా పేరు చెప్పి బెదిరించినా లేదా రాజకీయ ఒత్తిళ్లు చేసినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. కచ్చితంగా బాధితుల పక్షాన నేను ఉంటానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.


# డాక్టర్ షేక్ అబ్దుల్ రహీంకు డాక్టరెట్ ప్రదానం




**హిందూపురం రూరల్ – సూర్య వాస్తవం, ఆగస్టు 12 :** హిందూపురం మండలం బేవినాహల్లి గ్రామ పంచాయతీ పశు సంవర్ధక శాఖ రైతు సేవ కేంద్రానికి చెందిన పశు వైద్య సహాయకులు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం గ్రామీణ పశువైద్య సేవల రంగంలో అంకితభావంతో పని చేసి, పశువుల ఆరోగ్య సంరక్షణ మరియు రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ గుర్తింపు పొందిన ప్రముఖ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరెట్ అందుకొన్న విషయం విధితమే. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం సేవలను స్మరించుకుంటూ వారి అంకిత భావానికి గౌరవంగా తేది 10-08-25 ఆదివారం నాడు విజయవాడ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ అసోసియేషన్ మరియు రేడియాలజీ అసోసియేషన్, 3 వ రాష్ట్ర మహాసభ లో అధ్యక్ష మరియు కార్యనిర్వాహక సభ్యులు కలిసి అభినందన సన్మానం ఘనంగా చేశారు.

ఇందులో భాగంగా ముఖ్య అతిదులు శాసనసభ్యులు బొండా ఉమ, మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు, గన్నవరం మాజీ శాసనసభ్యులు కొండేటి చిట్టి బాబు, నాయకులు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి నేతృత్వంలో రాష్ట్ర నలు మూలల నుండి ల్యాబ్ టెక్నీసియన్‌లు జిల్లా పెసిడెంట్లు మాట్లాడుతూ, ఇవాళ మనం ఎంతో గర్వంతో, ఆనందంతో కూడిన ఘట్టానికి సాక్షులమవుతున్నామని సేవారంగంలో విశిష్టంగా కృషి చేసిన వ్యక్తికి, గౌరవ డాక్టరేట్ లభించడం అంటే ఇది కేవలం ఓ బిరుదు కాదు – అది సమాజం వైపు నుంచి ఒక అంగీకార ముద్ర, ఒక కృతజ్ఞతా గౌరవం అన్నారు. మన అవార్డు గ్రహీత మూగ జీవాల సేవ తన భాద్యతగా నిరంతరం ప్రజల పట్ల ప్రేమతో బాధ్యతతో స్ఫూర్తితో వ్యవహరిస్తూ గడచిన కొద్ది కాలంలో గ్రామంలో ఎంతోమంది రైతులకు ప్రభుత్వ పతకాలపై అవగాహనా సదస్సులు నిర్వహించడం గోసేవయే మాధవ సేవగా భావించడం ఇది చిన్న విషయం కాదు ఇది ఓ మహాత్కా ర్యమని హితవుపలికారు. చివరగా డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ ఈ గౌరవ డాక్టరేట్ నాకు లభించడం నా ఒక్కడికి గౌరవం కాదు ఇది మన సమాజానికి గర్వ కారణమని ఎందుకంటే ఈ ఘనత మనకోసం స్ఫూర్తిగా నిలుస్తుందని, కొత్త తరానికి మార్గదర్శక మైతుందని సేవ చేస్తూ నిజాయితీగా జీవిస్తూ ఎంత దూరమైనా చేరుకోవచ్చు అనే నమ్మకాన్ని కలిగిస్తుందన్నారు. ముఖ్యంగా సేవ చేస్తూ మానవత్వాన్ని పెంపొందించు కుంటే, గుర్తింపు వెతుక్కుంటూ వస్తుందని. మనం ఇచ్చే సహాయం, మార్గనిర్దేశమే ఇంకొకరి జీవితాన్ని వెలుగులోకి తీసుకురాగలదని, ల్యాబ్ టెక్నీసియన్లు మానవ సేవే పరమధర్మమని భావించి తమ పరీక్షల ద్వారా వైద్య నిర్ధారణ చేయడం, డాక్టర్లు రోగులకు వైద్యం ద్వారా జీవం పోయడం ఒక మహాత్కార్యామన్నారు తద్వారా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ముండ్ల శ్రీనివాసులు రెడ్డిని సన్మానించిన టీడీపీ నాయకులు



**చెన్నూరు – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** చెన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా నియామకమైన ముండ్ల శ్రీనివాసులరెడ్డిని మంగళవారం మండలంలోని ఓబులంపల్లి గ్రామంలో ఆయన నివాసంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శ్రీనివాసులు రెడ్డిని సన్మానించిన వారిలో తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు అల్లాడు రాజశేఖర్ రెడ్డి. జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం. యువ నాయకుడు మహేశ్వర్ రెడ్డి. ఐటిడిపి సమన్వయకర్త యామల మణికంఠ పలువురు సన్మానించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీలో పనిచేసే ప్రతి నాయకునికి ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు విలువలు ఉంటాయని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు సంపూర్ణమైన మద్దతును పార్టీ అధిష్టానం ఇవ్వడమే కాకుండా మంచి గుర్తింపు పార్టీ పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముండ్ల శ్రీనివాసరెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తించి సింగిల్ విండో చైర్మన్ గా నియమించడం జరిగిందన్నారు. శ్రీనివాసులు రెడ్డిని ఛైర్మన్‌గా ఎంపిక చేసినందుకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపా ధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి. కమలాపురం శాసనసభ్యు. పుత్త కృష్ణ చైతన్య రెడ్డిలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత అలవర్చుకోవాలి

### - ఎంఈఓ గంగిరెడ్డి



**చెన్నూరు – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** విద్యార్థిని విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత తోపాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలని ఎంఈఓ గంగిరెడ్డి తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం లో భాగంగా ఆయన మంగళవారం మండల వైద్యాధికారి వినయ్ కుమార్‌తో కలిసి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఆదిఆంధ్ర పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన నిబంధనలు గురించి మాట్లాడారు, విద్యార్థులు ఆరోగ్య వంతంగా ఉండేందుకు వారి రోజువారి ప్రక్రియలో ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి విద్యార్థులకు తెలియ జేశారు. నులిపురుగుల నివారణ గురించి ఆయన విద్యార్థులకు తెలియజేస్తూ జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలను ఇవ్వడం జరుగుతున్నదని తప్పక ఈ మాత్రలు విద్యార్థులు తీసుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు నులిపురుగుల నివారణకు వ్యక్తిగత శు భ్రత పాటించవలెనని, అదేవిధంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాని తెలిపారు. అలాగే బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా చెప్పులు ధరించి వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. 19 సంవత్సరాల పిల్లలకు కిశోర బాలలకు ఈ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందజేయబడుతుందని ఆయన తెలిపారు. పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు ఆగస్టు 20న జరిగే మాప్ అఫ్ రోజుల్లో అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## అరుంధతి నగర్ వాసుల ఇక్కట్లు

### - వర్షం నీరు పోయే దారి లేక ఇబ్బందులు
### - ఇప్పటికే విషజ్వరాలతో అల్లాడుతున్న జనం
### - పట్టించుకోని పంచాయతీ అధికారులు



**చెన్నూరు – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు ఇండ్ల చుట్టూ రోడ్లలో నిలవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అక్కడి ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే వర్షపు నీరు పోయే దారి లేక నీరు నిలువ ఉండడం తో దోమల బెడద వల్ల అంటు రోగాలు ప్రబలుతున్నాయని, ఇప్పటికే వాంతులు, వీరేచనాలతో ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి బాట పట్టడం జరిగిందని ఈ విషయమై స్థానిక పంచాయతీ కార్యాలయంలో తమ గోడు ను విన్నవించుకున్నప్పటికీ పంచాయతీ అధికారులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని వారు వాపోయారు. అటు పంచాయతీ అధికారులు నేషనల్ హైవే అధికారులకు చెప్పాలని సూచించడం జరిగిందని అయితే నేషనల్ హైవే అధికారులు పంచాయతీ అధికారులకే చెప్పుకోండని చెప్పడం జరిగిందని అక్కడ ప్రజలు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ హైవే విస్తరణలో భాగంగా తమ ఇళ్లను స్థలాలను నేషనల్ హైవే అధికారులు తీసుకోవడం జరిగిందని అయితే ఇక్కడ సక్రమంగా సర్వీస్ రోడ్డు గాని డ్రైనేజీ కానీ నిర్మించకపోవడంతో వర్షపు నీరు వెళ్లే దారి లేక తమ ఇండ్ల చుట్టూ రోడ్లలో నిలువ ఉండడంతో తాము అనేక విధాలుగా ఇబ్బందులు పడడమే కాకుండా తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని అక్కడ ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అధికారులను అర్థిస్తున్నారు.

### సమగ్ర ఐఈసీ ప్రచార

## కార్యక్రమాన్ని ప్రారంభించిన డిఎంహెచ్ఓ





**పుట్టపర్తి – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లాలో సమగ్ర ఐఈసి ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డి ఎం హెచ్ ఓ ఆఫీసు వద్ద ప్రారంభమై "వై" జంక్షన్ కూడలి వరకు వెళ్ళి అక్కడ మానవహారం ఏర్పాటు చేసి అక్కడ నుండి తిరిగి డిఎంహెచ్వో ఆఫీసు వరకు నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం మాట్లాడుతూ.. ఈ సమగ్ర ఐ ఈ సి ప్రచార కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో రెండు నెలల పాటు జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 400 స్కూల్స్ 80కి పైగా కాలేజీలలో హెచ్ఐవి హెచ్ఐవి/ సుఖ వ్యాధుల నియంత్రణ , మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం వల్ల కలిగే చెడు ప్రభావం పై ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ... ఈ కార్యక్రమ ఉద్దేశ్యాలను వివరించారు. హెచ్ఐవి సంక్రమించే మార్గాల పట్ల అవగాహన కల్పించటం, హెచ్ఐవి/ఎయిడ్స్ చట్టం 2017 పట్ల అవగాహన కల్పించటం, హెచ్ఐవి సోకే అవకాశం ఉన్న వర్గాలను హెచ్ఐవి పరీక్షలు చేయించుకునే లాగ ప్రోత్సహించటం, సుఖవ్యాధుల పట్ల అవగాహన, కండోమ్ (నిరోధ్) వాడకం వల్ల ఉపయోగాలు తెలియచేయటం, హెచ్.ఐ.వి.తో జీవి స్తున్న వారి పట్ల వివక్షను రూపుమాపటం వంటి ఉద్దేశ్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన పోస్టర్లను డిఎంహెచ్వో ఫైరోజా బేగం ఇతర అధికారులు విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో క్షయ నియంత్రణ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, నారాయణస్వామి, టిఐ.ఎన్జీవో ప్రాజెక్టు మేనేజర్లు, ఆంజనేయులు, తిప్పేస్వామి, శ్రీనివాసులు, నవీన్, ఎన్జీవో సిబ్బంది మూర్తి, నవీన్, నిజం, జన జాగృతి, చైతన్య, ఫోర్డ్, శక్తి మైత్రి మహిళా మండలి సిబ్బంది, బాలాజీ జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓట్లు చోరీ చేసి అధికారం చేపట్టిన బీజేపీ

### - కదిరి నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షానవాజ్




**కదిరి – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** భారత రాజ్యాంగం వజ్రాయుధం లాంటి ఓటు హక్కు ను దేశ ప్రజలకు కల్పించిందని అలాంటి పవిత్రమైన ఓటును బిజెపి అధికార దాహానికి దుర్వినియోగం చేస్తుందని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సాక్షాధారాలతో సహా నిరూపించడం జరిగిందని కదిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షాన్ వాజ్ ఆరో పించారు. ఈ ఆధారాలకు సమాధానం ఇవ్వవలసినటువంటి కేంద్ర ఎన్నికల సంఘం దొంగ ఓట్ల చోరీతో వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని దొడ్డిదారిలో బిజెపి గెలుపు కోసం ఎన్నికల కమిషన్ పనిచేస్తూ ప్రజాస్వామ్యానికి కాపుల కాయవలసిన ఈసీఐ మోడీకి కాపు కాస్తుందని ఎన్నికల కమిషన్ తీరు చూస్తే మేడిపండు చందంగా ఉందని స్వతంత్ర వ్యవస్థ కాస్త బిజెపి చేతుల్లో కీలుబొమ్మగా మారిందని ఆర్ఎస్ఎస్ లాంటి అనుబంధ సంస్థల జాబితాలో ఈసీ కూడా భాగమై ఇవాళ దేశంలో ఎన్నికల కమిషన్ అంటే ఎలక్షన్ చోర్ కమిషన్గ మారడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం అని తెలియజేశారు. అదేవిధంగా మోడీ ఓట్ల దొంగ కాబట్టే మౌనం వహిస్తున్నారని, రాహుల్ గాంధీబయటపెట్టిన నిప్పులాంటి నిజాలపై సమాధానం చెప్పకుండా డిక్లరేషన్ అంటూ బీజేపీ మాటలు వింటూ కేంద్ర ఎన్నికల సంఘం నాటకాలు ఆడుతున్నారని, మోడీ జీ హుజూర్ అనకపోతే రాహుల్ గాంధీ స్పందించిన ఐదు ప్రశ్నలపై ఈసీ వెంటనే సమాధానం చెప్పాలని అదే విధంగా డిజిటల్ ఓటరు జాబితా ఎందుకు ఇవ్వడంలేదని సిసిటీవీ ఆధారాలు ఎందుకు నాశనం చేశారని ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని దేశ ప్రజలు అనుకుంటున్నారని బిజెపికి ఎన్నికల సంఘం ఏజెంట్గా మారిందని తెలియజేశారు. ఈసీఐ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయితే ప్రజాస్వామ్యం ముఖ్యం అనుకుంటే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తిన సందేహాలకు బదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ అధ్యక్షుడు అల్లబకష్, యూత్ నాయకుడు జబి ఉల్లా, శ్రీనివాసులు, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షుడు సుహీల్, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాత సుఖీభవ

## అమలు చేసినందుకు రైతుల భారీ ర్యాలీ

### - ర్యాలీని ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్





**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** పత్తికొండలో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి నందు కుగాను రైతన్నలంతా కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ కి భారీ ట్రాక్టర్, ఎడ్ల బండ్లు ర్యాలీతో కృతజ్ఞతలు తెలిపారు.కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో పత్తికొండ లో ఎడ్లబండ్ల, ట్రాక్టర్ లతో ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగినది. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ర్యాలీని ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అంబేద్కర్ కూడలి నుండి ప్రధాన రహదారులు మీదుగా మార్కెట్ యార్డ్ వరకు ట్రాక్టర్, ఎడ్ల బండ్ల ర్యాలీ రైతన్నల హర్ష ధ్వానాలతో పండుగ వాతావరణంలో కొనసాగింది. పెద్ద ఎత్తున రైతులు తమ ఎడ్ల బండ్లు మరియు ట్రాక్టర్లతో ర్యాలీలో కదం తొక్కి ఉత్సాహంగా ముందుకు సాగారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ లో ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాతలకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం కింద మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం వాటా 5000 రూపాయలు కేంద్రం వాట 2000 రూపాయల కలుపుకుని రైతుల అకౌంట్లో ?7,000 జమ చేస్తున్నామని అన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో 54 వేల 774 మంది రైతులకు 27.387 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులను నట్టేట ముంచారని కానీ కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ పరికరాలు అందజేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే రైతులకు వ్యవసాయ పనిముట్లు డ్రిప్ పరికరాలు సబ్సిడీ కింద అందజేశామన్నారు. ఈనెల 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే ఇచ్చిన హామీలు అమలు చేశామన్నారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను

# పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలి

**- అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతగా పూర్తి చేయాలి**

**- అభివృద్ధి కార్యక్రమాలపై ఆకట్టుకునేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలి:జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, ఆగస్టు 12:** ఈ నెల 15న స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగే 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగగా నిర్వహించి విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిధులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు. ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. పెరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండుగ సాగేలా సంసిద్ధం చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్డిఓ, తహసీల్దార్, మునిసిపల్ కమీషనర్ లకు సూచించారు. జాతీయ జెండా ఎగరవేయుట, వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, త్రాగునీటి ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల జారీ, ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు పంపిణీ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్ ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏఎస్పి వెంకట రత్నం, డిఆర్ఓ మధుసూదనరావు, ఆర్డిఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరసేవ లింగాయత ఫెడరేషన్ అండ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తుల్జాపూర్ స్వప్న



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** తెలుగుదేశం పార్టీ బీసీ వర్గాల పక్షపాతి అని మరోసారి రుజువైందని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న తెలిపారు. కూటమి ప్రభుత్వం నేడు ప్రకటించిన కార్పొరేషన్ ఛైర్మన్‌ల జాబితాలో వీరశైవ లింగాయత, లింగ బలిజ ఫెడరేషన్ అండ్ కార్పొ రేషన్ ఛైర్మన్‌గా స్వప్నను నియమించింది. కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, హోం మంత్రి అనిత, అనంత పురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్‌కి స్వప్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనకిచ్చిన బాధ్యత పార్టీ ప్రజల సహకారంతో సమర్ధవంతంగా నిర్వహిస్తానని స్వప్న తెలియజేశారు.

## నులి పురుగులను నులిపేస్తేనే పిల్లలకు పండండి ఆరోగ్యం



**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** చిన్నారుల పాలిట శాపంగా మారిన నులిపురుగులను నిలిపేస్తేనే పండింండి ఆరోగ్యం సాధ్యమని వక్తలు తెలిపారు. ఐసీడీఎస్ అనంతపురం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని రాణి నగర్ – 4 అంగన్వాడీ కేంద్రంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగ న్వాడీ వర్కర్ లక్ష్మీ నరసమ్మ, ఆరోగ్య కార్యకర్త నీలావతి మాట్లాడారు. నులి పురుగుల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం

# రైతుల పక్షపాతి చంద్రబాబులి

**- రైతులు ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆశయం**

**- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**





**శ్రీ సత్య సాయి బ్యూరో –సూర్య వాస్తవం, ఆగస్టు 12:** ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నేతృత్వంలో మంగళవారం పుట్టపర్తి గణేష్ సర్కిల్ లో వందలాది ట్రాక్టర్లతో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీకి సుమారు వందలాది మంది రైతులు ,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. ఈ ర్యాలీ గణేష్ సర్కిల్,సాయి ఆరామం ,ఆర్టీసీ డిపో, చిత్రావతి రోడ్డు , కర్ణాటక నాగేపల్లి, జానకంపల్లి, బుక్క పట్నం, బుక్కపట్నం చెరువు కట్టపై,కొత్త చెరువు పట్టణం నెహ్రూ సర్కిల్, మీదుగా మార్కెట్ యార్డు వరకు రైతు కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ , ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 46 లక్షల మందికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా తొలి విడుతలో రూ,2,342.92 కోట్లు రైతు ఖాతాకు మంజూరు చేసామని తెలిపారు. సత్యసాయి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 2,65,040 రైతులకు రూ.180 కోట్ల 87 వేలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందజేసినట్లు వెల్లడించారు.ఇలాంటి మంచి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబును జీవితాతం గుర్తు పెట్టుకుని కృతజ్ఞత చెప్పాలని కోరారు. ప్రజలు ఇచ్చిన మంచి తీర్పుతో రాష్ట్రంలో 164 సీట్లతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. వైసీపీ కేవలం 11 సీట్లకు మాత్రమే ప్రజలు పరిమితం చేశారని పేర్కొన్నారు .సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ నాయకుడిగా రైతుల మదిలో నిలిచిపోయారని కొనియాడారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వంలో పెండింగ్ పడిన ధాన్యం కొనుగోలు బకాయి నిధులు 1600 కోట్లు కూటమి ప్రభుత్వం రైతులకు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 26 కోట్లతో 610 సిసి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని అంతేకాకుండా భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ శతజయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన వెంటనే ప్రభుత్వం బాబా వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రత్యేక జీవో మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే పలి సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి అభివృద్ధికి జాయ్ లూకాస్ ప్రతినిధులు కోటి 20 లక్షలు సీఎస్ఆర్ నిధులు ఇచ్చారని వారికి పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరపున ,నా తరపున వారికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలను 98 శాతం అమలు చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా టిడిపి కార్యకర్తలకు అన్ని విధా లుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో 500 మంది కార్యకర్తలకు పలు రకాలుగా పదవులు రేషన్ షాప్ డీలర్లు యానిమేటర్లు ఫీల్డ్ అసిస్టెంట్లు సింగల్ విండ్ అధ్యక్షులు డైరెక్టర్లు పదవులు ఇచ్చి న్యాయం చేసామన్నారు. కష్టపడిన కార్యకర్తలకే ప్రభుత్వ పదవులు ఇస్తామని తెలిపారు పార్టీకి పనిచేయని వారిని పక్కన పెట్టి తీరుతామని హెచ్చరించారు. మరో 20 ఏళ్లు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని అందుకు కూటమి పార్టీలో బిజెపి జనసేన టిడిపి కలసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలుచుకునే విధంగా క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పత్తి చంద్రశేఖర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, వైస్ చైర్మన్ ప్రేమనాథరెడ్డి ,రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ , కూటమి పార్టీల సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు టిడిపి మండల కన్వీనర్లు వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ ,మల్లిరెడ్డి , విజయ్ కుమార్ , జయచంద్ర శివశంకర్ ,గోపాల్ రెడ్డి ,కూటమిపార్టీకి చెందిన సింగల్ విండో అధ్యక్షులు డైరెక్టర్లు ,మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు ,కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారత గడ్డపై ఏఐఎస్ఎఫ్‌కు 90 ఏళ్లు

**- ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** పత్తికొండ ప్రభుత్వ జూని యర్ కళాశాల దగ్గర ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండా ఆవి ష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ కృష్ణయ్య పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలకు ఏఐఎస్ఎఫ్ ఉద్యమాల సిద్ధం కాలనీ ఎందుకంటే ఏఐఎస్ఎఫ్ 1936 ఆగస్టు 12వ తేదీన ఉత్తర ప్రదేశ్ లక్నో మహానగరంలో ఆవిర్భవించిందని వారు పేర్కొన్నారు. రామాంజనేయులు డోంగ్రి అల్తాఫ్ రంగస్వామి మనోహర్ విక్రం ఉపేంద్ర పెద్దయ్య సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ల కార్యాలయాలను, ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, ఆగస్టు 12:** మదనపల్లె కలెక్టర్ చల్లా కళ్యాణి పెద్దమండెం, తంబళ్లపల్లి మండలాల తాసిల్దార్ కార్యాలయాలను మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంబంధిత మండలాల తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ , ఇతర రెవెన్యూ సిబ్బందితో రెవెన్యూ , ఇతర అంశాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. అనంతరం పెద్దమండెం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబం ధించిన వివిధ రిజిస్టర్లను, అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేసి అధికారులకు మరియు సిబ్బందికి తగు సూచనలు చేశారు. పెద్దమండెం లోని ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి వివిధ అంశాలపై పాఠశాల సిబ్బందికి తగు సూచనలు చేశారు.

# పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ వాడాలి

**- జోనల్ అధికారి రామ గిడ్డయ్య**




**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, ఆగస్టు 12:** రీజినల్ డైరెక్టర్ రామ గిడ్డయ్య ఆధ్వర్యంల ఆల్బెండజోల్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆల్బెండెన్సువల్ కార్యక్రమంలో జోనల్ అధికారి అయిన రామగిడ్డయ్య , డాక్టర్ భాస్కర్ వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ సుజాత తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిం చుటకు విచ్చేసినటువంటి జోనల్ మరియు జిల్లా అధికారులకు పత్తికొండ టౌన్ లోని అన్ని స్కూల్స్ ను విజిట్ చేయడం జరిగినది అదేవిధంగా స్థానికంగా ఉన్నటువంటి జడ్పీ హైస్కూల్ గర్ల్స్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రామకిడ్డయ్య ప్రసంగిస్తూ... కచ్చితంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్ పంపిణీ చేయడం జరుగుతుందని భోజనానంతరం ఈ కార్యక్రమం ఉంటుందని స్కూలు బయట ఉన్న పిల్లలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకునే విధంగా తగిన ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.
అదే విధంగా ఈనెల 20వ తేదీ కూడా మాప్ కార్యక్రమం ఆల్బెండాతో కార్యక్రమం ఉంటుందని దీంట్లో కూడా వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఇందులో భాగస్వామ్యంగా అన్ని స్కూల్స్ కాలేజీలు ఎలిమెంటరీ స్కూల్స్ అంగనవాడి సెంటర్లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సుజాత తెలిపారు .మొత్తం 15990 మంది పిల్లలకి ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

## ఆటో బోల్తా పడి వృద్ధురాలు మృతి



**మదనపల్లి– సూర్య వాస్తవం, ఆగస్టు 12:** ఆటో బోల్తా పడటంతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. బొమ్మనచెరువు పంచాయతీ, టేకులపాళ్యం సమీపంలోని పందివానిపల్లికి చెందిన లేట్ వెంకటరమణ భార్య చిన్న పాపమ్మ (70) బొమ్మను చెరువు సచివాలయం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని మందబండ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో చిన్నపాపమ్మ తీవ్రంగా గాయపడగా, డ్రైవర్ రామి రెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్న పాపమ్మ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన రామిరెడ్డిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హౌసింగ్ లేఅవుట్‌ను, వ్యర్థ పదార్థాలు
# ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**అన్నమయ్య బ్యూరో- సూర్యవాస్తవం, ఆగస్టు 12:** రామాపురం మండలం నల్లగుట్ట పల్లి లోని హౌసింగ్ లేఔట్ ను, వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హౌసింగ్ లేఅవుట్ పై సమీక్షిస్తూ.... లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన సహాయాన్ని ఇళ్లను కట్టుకునే వారికి అంది ంచాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థ పదార్థాలు ప్రాసెసింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సందర్భంగా... వ్యర్థపదార్థాల ప్రాసెసింగ్ కేంద్రంలోకి తడి చెత్త , పొడి చెత్త లను వేరు చేసి తీసుకురావాలని, గ్రామ పంచాయతీలోని అన్ని కుటుంబాల నుండి చెత్త సేకరణ జరగాలని పంచాయతీ సెక్రటరీని జిల్లా కలెక్టర్ ఆదే శించారు. గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని కుటు ంబాల నుండి చెత్త సేకరణ జరిగేందుకు అవసరమయ్యే గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసుకోవాలని, ఏమైనా ఖాళీలు ఉంటే వాటిని వెంటనే భర్తీ చేసుకొని 100% చెత్త సేకరణ జరగాలని ఎంపీడీవోను, పంచాయతీ సెక్రటరీని ఆదే శించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రాధమ్మ, రామా పురం మండలం ఎంపీడీవో జాషువా తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా కాలువలపై అక్రమ వ్యాపారాలు

### రోడ్డు దాటాలంటే ప్రజలకు కత్తి మీద సామలాంటిదే..





**హిందూపురం- సూర్య వాస్తవం, ఆగస్టు 12:**
పట్టణంలోని పరిగి రోడ్డు లోని సప్తగిరి కాలేజీ రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువల శుభ్రపరిచే పనులు మునిసిపాలిటీ చేపట్టిన ప్పటికీ, ఆ పనుల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. స్తొమత లేని పేదల నివాసాల ముఖా ద్వారాల్ని పగలగొట్టి చిన్నభిన్నం చేశారు. ప్రక్కనే వున్న బడాబాబుల భవనాల ముఖాద్వారాల్ని మాత్రం మర్యాద పూర్వకంగా వదిలేసి రాజనీతి వ్యవహరించిన వైనం మునిసిపల్ అధికారులకు అద్దం పట్టినట్లు కనిపిస్తుంది. ఇదే రోడ్డులో సప్తగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులు పసి పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటలేని పరిస్థితి ఏర్పడిందని, ఈ విష యంపై మునిసిపల్ కమీషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని తనిఖీ చేసి, అనుమతి లేకుండా కాలువలపై అక్రమంగా వ్యాపారనిమిత్తం నిల్వ చేసివున్న వాటిని తొలగించి, ప్రమాదాలను అరికట్టి భవిష్యత్ లో పునరావృతం కాకుండా చూడాలని స్థానిక నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ సమస్యల పరిష్కారానికి సంభందించి స్థానిక మునిసిపల్ కమీషనర్‌కి పత్రిక ప్రకటన ద్వారా ఫిర్యాదు చేస్తున్నారు. పూర్తి జాగ్రత్తలతో పనులు చేపట్టాలని, మరమ్మతులు త్రవ్విన వెంటనే చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు సమస్యలు ఎదుర్కొనేలా కాకుండా, మునిసిపల్ అధికారులు ముందస్తుగా ప్రజలకు సమాచారం ఇచ్చి పనులు ప్రారంభించిచాలని,,వీధుల్లో చెత్త బహిరంగాను విచ్చలవిడిగాను వేసి ఆనారోగ్య కారణాలకు గురిచేస్తున్న దుకాణదార్లకు నోటీసులు జారీ చేసి చెత్త కుండీలను ఏర్పాటు చేయాలనీ కోరుతున్నారు.

అంతే కాకుండా కాలువలపై అనుమతులు లేని వ్యాపారస్తులకు రాజకీయ అధికారిక అండదండలు మెండుగా ఉన్నట్లు ఇక్కడి వాతావరణనికి నిర్వచనంగా కనిపిస్తున్న వైనం.

# మళ్లా పాలిటిక్స్‌లోకి వెంకయ్య....?



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, ఆగస్టు 12:**
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్థితప్రజ్ఞుడు. బిజెపిలో ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్నారు. ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తర్వాత క్రియాశీలక రాజకీయాలు తగ్గించారు వెంకయ్య నాయుడు. అయితే ప్రస్తుతం ఉపరాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ వచ్చిన తరుణంలో.. వెంకయ్య నాయుడు ఢిల్లీలో బిజీగా గడుపుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రధాని మోదీ తో ఏకాంత సమావేశాలు.. ఆర్ఎస్ఎస్ ముఖ్యులతో భేటీలు.. ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. కేంద్రంలో మారుతున్న లెక్కలతోనే వెంకయ్య నాయుడు ఎంట్రీ ఇచ్చారన్న ప్రచారం సాగుతోంది. వెంకయ్య నాయుడు రాజకీయాల్లో తిరిగి యాక్టివ్ అవుతారా? ఉప రాష్ట్రపతి పదవిని మరోసారి అందుకుంటారా? లేకుంటే బిజెపి జాతీయ చీఫ్ గా బాధ్యతలు తీసుకుంటారా? అన్న టాక్ అయితే ప్రారంభం అయింది.వెంకయ్య నాయుడు బిజెపిలో సుదీర్ఘకాలం పనిచేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్ నుంచి ప్రారంభమైన వెంకయ్య నాయుడు ప్రస్థానం ఉప రాష్ట్రపతిగా ముగిసింది. అయితే వెంకయ్య నాయుడును భారత రాష్ట్రపతి చేస్తారని అంతా భావించారు. కానీ బిజెపి పెద్దల ఆలోచన వేరేలా సాగింది. గిరిజన మహిళ ద్రౌపది ముర్మును తెరపైకి తెచ్చి రాష్ట్రపతి పీఠంపై కూర్చోబెట్టారు. తద్వారా గిరిజనులతో పాటు మహిళల మనసును గెలిచారు. ద్రౌపది ముర్ము ఎంపిక తో ఒడిస్సాలో బిజెపికి సానుకూలత కనిపించింది. ఆ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడానికి కారణం అయ్యింది. అయితే వెంకయ్య నాయుడు సేవలను బిజెపి ఎలా వాడుకుంటుందోనన్న చర్చ జరిగింది. కానీ గత కొద్ది రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు వెంకయ్య నాయుడు. అయితే కేంద్రంలో మారిన పరిస్థితుల నేపథ్యంలో వెంకయ్య నాయుడు అవసరం ఏర్పడినట్లు తెలుస్తోంది.బిజెపి జాతీయ అధ్యక్ష పదవి భర్తీకి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే అంతకంటే ముందే ఉపరాష్ట్రపతిగా ఉన్న వ్యక్తి రాజీనామా చేశారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎంపిక అనివార్యంగా మారింది. అయితే దక్షిణాది రాష్ట్రాలకు చాన్స్ ఇవ్వాలని బిజెపి పెద్దలు భావిస్తున్నారు. కానీ ఈ విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఇటీవల ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకత్వం మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని ప్రచారం జరుగుతోంది. అందుకే ట్రబుల్ షూటర్ గా పేరు పొందిన వెంకయ్య నాయుడును బిజెపి పెద్దలు పిలిచారని.. ఆ సమస్యకు ఒక పరిష్కార మార్గం చూపించాలని కోరారని.. అందుకే వెంకయ్య నాయుడు వరుసగా భేటీలు జరుపుతున్నారని తెలుస్తోంది. అయితే మరోసారి ఉపరాష్ట్రపతి పదవిని వెంకయ్య నాయుడు తీసుకునే అవకాశం లేదు. దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వాలనుకుంటే.. తమిళనాడుతో పాటు కర్ణాటక నేతల పేర్లను పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. మొన్న మధ్యన బీహార్ ప్రధాని నితీష్ కు ఉపరాష్ట్రపతి పదవి ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు వెంకయ్య నాయుడును పిలిచి చర్చిస్తుండడంతో అసలు ఎంపిక ఎలా ఉంటుందా అన్న ఉత్కంఠ కొనసాగుతోంది.మరోవైపు బిజెపి జాతీయ అధ్యక్ష పదవిని భర్తీ చేయాలని భావిస్తోంది హై కమాండ్. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగిసింది. పైగా ఆయన కేంద్ర మంత్రి కూడా. బిజెపిలో జోడు పదవులు ఉండకూడదు అన్నది నిబంధన. అందుకే వెంకయ్య నాయుడుకు బిజెపి జాతీయ పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రధానితో 40 నిమిషాలు భేటీ అయిన వెంకయ్య నాయుడు.. ఆర్ఎస్ఎస్ ముఖ్యులతో సైతం గంట పాటు కీలక చర్చలు జరిపారు. దీంతో వెంకయ్య నాయుడు సేవలను బిజెపి వినియోగించుకుంటుందన్న ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## ఉరేసుకుని మహిళ
# ఆత్మహత్యా యత్నం



**మదనపల్లె -సూర్యవాస్తవం, ఆగస్టు 12:** కుటుంబ సమస్యలతో గొడవ పడిన మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళ`వారం మదనపల్లె పట్టణం లో జరిగింది. బాధితు రాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నీరుగట్టువారి పల్లి, మారుతినగర్ కు చెందిన వెంకటేష్ భార్య కృష్ణమ్మ (44) కుటుంబ సమస్యలపై గొడవ పడింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే కిందికి దింపి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. బాధితురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు శిక్ష
### - ద్విచక్ర వాహనం సీజ్

**అనంతపురం క్రైం -సూర్య వాస్తవం, ఆగస్టు 12:** పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి 14 రోజులు రిమాండ్ విధిస్తూ అనంతపురం కోర్టు తీర్పు ఇచ్చింది. అనంతపురం నాలుగవ పట్టణ పోలీసు వారు తెలిపిన వివరాలు మేరకు..... ఆగస్టు 7వ తేదీ అనంతపురం పట్టణంలోని స్థానిక బళ్లారి బైపాస్ సర్కిల్లో ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.అదే సమయంలో అనంతపురం మండలం కురగుంటకు చెందిన రంగరాజ రెడ్డి మద్యం సేవించి తన ద్విచక్ర వాహనంపై రాగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేయడానికి ప్రయత్నించగా... వారితో దురుసుగా మాట్లాడి దాడికి పాల్పడి విధులకు ఆటంకం కలిగించాడు.దీనిపై ట్రాఫిక్ పోలీస్ భాస్కర్ ఫిర్యాదు మేరకు స్థానిక నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్లో రంగరాజ రెడ్డి పై కేసు నమోదు చేసుకొని మంగళవారం నాడు కోర్టు ముందు హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ రంగరాజ రెడ్డికి 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే అతని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని నాలుగవ పట్టణ సీఐ జగదీష్ తెలిపారు

## ఆరోగ్యవంతమైన పిల్లల కోసం
# నులిపురుగులను నిర్మూలిద్దాం



**వడమాలపేట- సూర్య వాస్తవం, ఆగస్టు 12:** జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలోని మూడు నుంచి ఆరు సంవత్స రాల పిల్లలకు మంగళవారం ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి అంగన్వాడీ కేంద్రా లలో ఉన్న ప్రీస్కూల్ పిల్లలకు ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్ర ఇవ్వడం జరిగినది నులిపురుగుల నుండి రక్షణకు ఆహార లోపం లేకుండా ఉండడానికి శారీరక, మానసిక ఎదుగుదలకు, పోషకాల గ్రాహ్యతను మెరుగుపరచడానికి పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వడమాలపేట మండలంలోని 43 అంగన్వాడీ కేంద్రాలలో అంగన్వాడీ కేంద్రం టీచర్లు ఆరోగ్య శాఖ సిబ్బంది ఆశ ఏఎన్ఎం ఎంఎల్‌హెచ్‌పి ద్వారా ప్రతి ఒక్కరికి ఆల్బెండజోల్ టాబ్లెట్లు మధ్యాహ్నం భోజనం పెట్టిన తర్వాత ఈరోజు ఇప్పించడం జరిగింది. గైర్హాజరైన పిల్లలకు ఆగస్టు 20వ తారీఖున ఆల్బెండజోల్ టాబ్లెట్లు ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ బి.గీతాంజలి రెండు అంగన్వాడీ కేంద్రాలలో పాల్గొన్నారు. ఎస్విపురం, గంధపు హెచ్ డబ్ల్యు తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )